జన రాజకీయం కోసం...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 8 సంచిక - 02 పక్షపత్రిక జనవరి 16-31, 2017



## మోదీ కాస్త మనసు పెట్టి చదువుతున్నారట !

(డీమానిటైజేషన్ శుద్ధి)

## స్థానిక స్వయంపాలనను సహించలేని పెత్తందారీ ముఖ్యమంత్రులు







సాంప్రదాయ సైన్స్‌ను, వైద్యాన్ని ఆధునిక సైన్స్, వైద్యంతో అనుసంధానం చేయటం పై మైసూర్ యూనివర్శిటీలో జరిగిన జాతీయ సదస్సులో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్



జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక జనవరి 16-31, 2017

సంపుటి - 8 సంచిక - 02

## లోపలి పేజీల్లో...

మోదీ కాస్త మనసుపెట్టి చదువుతున్నారట...5
బినామీ చట్టం బ్రహ్మాస్త్రమా....................16
బినామీ లావాదేవీల (నిషేధ) చట్టం........ 17
నగదు రహితం ఇలాగా?.....................19
దేశ ఆరోగ్య సంక్షోభాన్నీ బైటపెట్టిన......... 21
2017 లోనైనా హక్కుగా పౌరసేవల...... 23
డిజిటల్ రోడ్‌మ్యాప్........................ 24
అరెస్టులు చేసి పబ్లిక్ హియరింగ్........... 25
ఇకనుంచి జవాబుపత్రాలు రూ.100కే.... 26
లోక్‌సత్తా అంశాల చుట్టూనే రాజకీయం.. 27
విధివిధానాలు లేకుండానే ప్రైవేటు .......... 28
మీడియా ప్రమాణాలతో ప్రజాస్వామ్య...... 29
స్థానిక స్వయంపాలనను సహించలేని..... 30
ఈ తీర్పు మార్పుగా మారాలంటే .......... 34

సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# వ్యవస్థీకృత నిజాయతీ, ఆలోచన కావాలి



నరేంద్ర మోదీ ప్రధానమంత్రి పదవీకాలం వేగంగా గడిచిపోతోంది, దేశంలో రోజూ ఏవో సంచనల వార్తలు, ప్రకటనలు, ఉగ్రూతలూగించే ఉపన్యాసాలు వినిపిస్తున్నాయి, కనిపిస్తున్నాయి.. కానీ నిజంగా ఈదేశాన్ని మార్చి ప్రజలకు మెరుగైన జీవితాన్ని అందించే విధానాలు, పరిణామాలు మాత్రం కనుచూపు మేరలో కానరావటం లేదు. ఈ దేశంలోని రుగ్మతలకు ఔషధం ఎక్కిస్తున్న ఓ గొప్ప డాక్టర్‌గా, నాయకుడిగా, దార్శనికుడిగా మోదీ తనను తాను ఊహించుకుంటూ వ్యక్తిగతంగా నిజాయతీతో అందుకు కష్టపడుతూండవచ్చు, కానీ కొన్ని ఆర్థిక, దౌత్య వ్యవహారాల్లో మినహాయించి వాస్తవాలు ఆయన ఊహలకు దూరంగా సాగుతున్నాయి.. నల్లధనం, అవినీతి అంతానికి ఓ జాతీయ పార్టీ నాయకుడిగా, సోషల్ మీడియా యుగంలో ఉన్న ప్రధానమంత్రిగా పెద్ద నోట్ల రద్దు నిర్ణయం అవసరమని ఆయన భావించి ఉండవచ్చు. కానీ అమలు చేసే ముందు ఆలోచన లేకపోవటం, వ్యవస్థలను పరిగణలోకి తీసుకోకపోవటం వల్ల కోట్లాది ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. నాయకుడొక్కడే చాలు అనుకునే ధోరణి భారత్ వంటి సువిశాల, సంక్లిష్ట ప్రజాస్వామిక దేశంలో అనేక విపరిణామాలకు దారితీస్తాయనే అవగాహన కొరవడటం వల్లే ఈ పరిస్థితి తలెత్తింది. టెక్నాలజీతో కేంద్రీకృత పాలన వైఫల్యాన్ని అధిగమించవచ్చన్న ప్రధాని అంచనాకు కూడా పరిమితులున్నాయి. టెక్నాలజీయే సర్వరోగనివారిణి అయితే - ఏ అమెరికా నుంచో ఒకటిరెండేళ్లలో దిగుమతి చేసుకుని అన్ని సమస్యల్నీ పరిష్కరించేసుకునేవాళ్లం గదా! సాంకేతికతను బదిలీ చేసినంత తేలిగ్గా రాజకీయ సంస్కృతిని, పాలనను, ప్రజాస్వామిక విలువలను బదిలీ చేసి ఫలితాలను సాధించలేం. ప్రజాస్వామిక పరివర్తనను దీర్ఘకాలిక బహుముఖ పోరాటంగా భావించి గట్టి పునాదిని వేస్తుండాలి. ప్రపంచదేశాల అనుభవాలను, దేశీయ పరిస్థితులను, ప్రజల భాగస్వామ్యాన్ని సంధానం చేస్తూ అధ్యయనం, ఆలోచనతో విధానాలను రూపొందించాలి. మనిషి ఎంత ఆధునిక యుగంలో ఉన్నాననుకున్నా.. జంతు లక్షణాల నుంచి బైటపడగల ఆలోచనా సంస్కృతి ఇంకా రాలేదు. ప్రజలను ఆలోచన పెంచుతూ సమీకరించాలి. మన వ్యవస్థలు ఎంత అధ్వాన్నంగా, అసమర్థంగా, జవాబుదారీరహితంగా ఉన్నాయో, ప్రజాస్వామ్యంలో నిజమైన సార్వభౌములైన ప్రజలంటే ప్రభుత్వ వ్యవస్థలకు ఎంత చులకన భావమో నోట్ల రద్దు వ్యవహారం బాధాకరంగా బైటపెట్టింది. వ్యక్తుల్లో, బృందాల్లో నిజాయతీ, సమర్థత ఉన్నాయి. కానీ దేశంలోని ప్రభుత్వ కార్యాలయాలు సహా వ్యవస్థల్లో మాత్రం అవి కొరవడ్డాయి. వ్యక్తిగత నిజాయతీని వ్యవస్థీకృత నిజాయతీగా మార్చే మహాకార్యాన్ని కొంతైనా నెరవేర్చటానికి మోదీని 2014లో ఎన్నుకుంటే.. ఆయన ప్రతిదీ వ్యక్తిగత సామర్థ్యానికి, నిజాయతీగా సంబంధించిన అంశంగా భావిస్తూ దేశ భవిష్యత్తుకు సమస్యలు తెస్తున్నారు. అన్నీ ప్రభుత్వమే చేయగలదనే పాత లైసెన్సు రాజ్యం విధానాలను మళ్లీ చెలామణిలోకి తెస్తున్నారు. నోట్ల రద్దు అనుభవంతోనైనా ఈ వ్యక్తిగత ధోరణుల్ని మోదీ సరిదిద్దుకోవాలి. తాను చెబుతున్న అవినీతిరహిత, నిజాయతీ సమాజానికి దోహదం చేసే వ్యవస్థల నిర్మాణం మీద దృష్టి కేంద్రీకరించాలి. ఇందుకోసం సరైన ఆలోచనల్ని ఎవరినుంచైనా తీసుకునే ఉదార ప్రజాస్వామిక విలువను పాటించాలి. మనమంతా భారతీయులమేగా! 2017 సంవత్సరంలో దేశానికి కావలసిన కనీసం ఐదు నిర్దిష్ట సంస్కరణలను చేసి చూపించాలి. ఈ ఐదు మార్పులూ పెద్దవేగానీ, పూర్తి ఆచరణాత్మకమైనవి, జీడీపీలో కేవలం 1శాతంతోనే అమలు చేయవచ్చు. "1) పౌర సేవల చట్టం తేవటం: ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు కావలసి ధ్రువపత్రాలు, ఎఫ్ఐఆర్ నమోదు, నీటి, విద్యుత్ కనెక్షన్లు, భూ రికార్డులు వంటి సేవలను హక్కుగా, గౌరవప్రదమైన రీతిలో, నిర్ణీత గడువులోగా సేవలందించేందుకు 'పౌర సేవల' (సర్వీస్ గ్యారంటీ) చట్టం తేవాలి. గడువులోగా సేవలందించకపోతే రోజుకు కనీసం రూ.250 జరిమానాగా దరఖాస్తుదారునికి చెల్లించాలి. 2) చట్టం, న్యాయం అందరికీ సమానంగా అందించటం: మనదేశంలో ప్రముఖులుగా చెలామణి అవుతున్నవారిపై కేసుల్ని నీరుగార్చేస్తున్నారు. చట్టం అందరికీ సమానంగా ఉండకపోతే తలెత్తేప్రమాదాల్ని గుర్తించాలి. శాంతిభద్రతల విభాగం నుంచి నేర దర్యాప్తు విభాగాన్ని వేరుచేసి జవాబుదారీతనమున్న స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలి. కేసులు స్థానికంగానే వేగంగా, తక్కువ ఖర్చుతో పరిష్కారమయ్యేలా 10,000 స్థానిక కోర్టుల్ని ఏర్పాటు చేయాలి. సమర్థ జడ్జీలు వచ్చేలా అఖిల భారత జ్యుడీషియల్ సర్వీసు (ఐజేఎస్)ను ఏర్పాటు చేయాలి. దీనికయ్యే ఖర్చు జీడీపీలో కేవలం 0.25శాతం. 3) అందుబాటులోకి నాణ్యమైన విద్య, ఆరోగ్యం: అవినీతి సహా ఎన్నో రుగ్మతల్ని పరిష్కరించి అందరికీ ఎదిగే అవకాశాలనివ్వటానికి కీలకమైన విద్య, ఆరోగ్యంలో మనం అత్యంత దారుణమైన స్థితిలో ఉన్నాం. విద్యావ్యవస్థలో ఇప్పుడున్న నిధులతోనే, ఆరోగ్యరంగంలో అదనంగా జీడీపీలో 0.6 - 0.8శాతం నిధుల్ని జోడించి దేశ ప్రజలందరికీ అవి నాణ్యమైన రీతిలో అందేలా విధానాల్ని రూపొందించాలి. 4) స్థానిక ప్రభుత్వాలకు 33శాతం నిధులు: ఢిల్లీలోనో, అమరావతి, హైదరాబాద్‌లోనో తీసుకున్న ఒక నిర్ణయం ప్రజల జీవితాల్ని అల్లకల్లోలం చేయకుండా ఉండటానికి స్థానిక ప్రభుత్వాలకు వార్డు స్థాయి దాకా 33శాతం నిధులను నేరుగా బదిలీ చేయాలి. 5) ఎన్నికల్లో నల్లడబ్బు నిరోధానికి సంస్కరణలు: అవినీతిపరులు, అసమర్థులు, నేరస్తులు రాజకీయాలలోకి రావటానికి మూలకారణమైన నల్లడబ్బు ఎన్నికల వ్యవస్థను మార్చటానికి రాష్ట్రాల్లో దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వంటి మార్పుల్ని రాజకీయ ఏకాభిప్రాయ సాధనతో సాధించాలి." ఐదు రాష్ట్రాల తాజా ఎన్నికల ఫలితాలు ఎలా వున్నా.. 'వ్యక్తిగత నిజాయతీ కనీస లక్షణం మాత్రమే - వ్యవస్థీకృత నిజాయతీ, ఆలోచనే నిజమైన ప్రజాసేవ' అని మోదీ, రాజకీయ పార్టీలు, మీడియా, పౌరసంఘాలు, ప్రజలు గుర్తించి వ్యవస్థలను మార్చగలిగే సృజనాత్మక సంస్కరణల్ని వేగంగా సాధించటం మీదే దేశ సుస్థిరాభివృద్ధి, మన సుఖసంతోషాలు ఆధారపడివున్నాయి.

మీ

నూతన సంవత్సర శుభాకాంక్షలతో...

# కార్టూన్ కార్నర్




## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**


*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.



# మోదీ కాస్త మనసుపెట్టి చదువుతున్నారట!

**(డీమానిటైజేషన్ శుద్ధి)**

**డీమానిటైజేషన్ (పెద్ద నోట్ల రద్దు) తర్వాత దేశంలో నల్లధనం, అవినీతి అంతమయ్యే మార్పులు ఏ రకంగా, ఎప్పుడు వస్తాయోగానీ, ప్రధాని మోదీలో మాత్రం మార్పు వచ్చిందంటున్నారు.**

**పులిని జూలో ఫోటో తీసే స్థాయి నుంచి పులి మీద స్వారీ చేసే ధైర్యాన్ని ప్రదర్శించానని తొలుత సంబరపడ్డ ప్రధానికి.... డీమానిటైజేషన్ ప్రకటన తర్వాతి పరిణామాలు చాయ్ కంటే ముందు తాగిన ఉగ్గుపాలను కూడా గుర్తుకుతెచ్చాయని కడక్ రాజకీయ వ్యాఖ్యానాలు చేస్తున్నారు.**

**మీ ప్రధానమంత్రి మంచి చేయాలనే తపన కలవాడు, మాటకారి, ధైర్యవంతుడేగానీ.. తెలివి, నాగరిక ప్రజాస్వామిక విలువలు లేనివాడు అంటే ఎంత అప్రతిష్ఠ!**

**మోదీ ఆలోచనాస్థాయిపై ప్రజలకు ఎంత స్పష్టత వచ్చిందంటే.. అవినీతిపై పోరాటంలో నా దగ్గర ఇంకా ఐడియాలున్నాయి అంటేనే హడలెత్తిపోతున్నారు.**

**ఇదంతా చూశాక.. పోస్టర్ చూసి సినిమా కథ చెప్పేస్తా అన్నట్టు ఎస్ఎంఎస్ బ్రీఫింగ్ విని పాలనా నిర్ణయాలు తీసుకుంటానని చెప్పుకునే ప్రధాని ఇప్పుడు కాస్త ఎక్కువ చదువుతూ, వివరాల్ని క్షుణ్ణంగా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారని విశ్వసనీయ గుసగుసలు.**

**.. డీమానిటైజేషన్ శుద్ధి గురించి మెరుగ్గా అర్థం చేసుకోవటానికి ఒకసారి అన్నా హజారే దగ్గరకు వెళ్లిరావాలి.**

లోక్‌సత్తా బెంగళూరులో నిర్వహించిన 'సాకు' ఉద్యమం, పీపుల్ ఫర్ లోక్‌సత్తా అమెరికాలో నిర్వహించిన 'దండిమార్చ్' స్ఫూర్తితో వచ్చిన ఇండియా అగనెస్ట్ కరప్షన్ (ఐఏసీ) ఉద్యమాన్ని రోజూ సంచలనాల సోషల్ మీడియా యుగంలో కూడా ఈ దేశ యువజనం ఇంకా మర్చిపోయి ఉండరు. ఐఏసీ వేదికగా గాంధేయ సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే చేసిన నిరాహార దీక్షను అంతగా జాతీయ మీడియా ఐఏసీని హోరెత్తించింది. 24గంటల్లో అరగంటో, గంటో తప్ప అంతా ఆ నిరాహారదీక్షనే చూపించారు. ఇంతకీ ఆరోజు అంత పెద్ద ఉద్యమానికి మూలమైన డిమాండ్ పరిస్థితి ఈరోజు ఎలా వుంది? ఆ డిమాండ్‌ను నెరవేరిస్తే రాత్రికి రాత్రి దేశం మారిపోతుంది అన్నారు గదా.. ఇప్పుడేం జరుగుతోంది?

ఈ ప్రశ్నలకు సమాధానాల్ని విసుక్కోకుండా వెతకటం మన మెరుగైన జీవితాలకు, బిడ్డల మెరుగైన భవిష్యత్తుకు ఎంతో అవసరం.

2012లో అన్నా హజారే న్యూఢిల్లీలో నిరాహారదీక్ష చేస్తున్నప్పుడు లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌కి మహారాష్ట్రకు చెందిన లోక్‌సత్తా సీనియర్ నేత

నుంచి ఫోన్ వచ్చింది. మహారాష్ట్రలో ఉండే అన్నా హజారేతో అప్పటికే లోక్‌సత్తా కొన్ని కార్యక్రమాలలో కలిసి పనిచేసింది. అన్నాకు వాహనాన్ని కొంతకాలంపాటు లోక్‌సత్తాయే సమకూర్చింది. అదే వాహనాన్ని జేపీ పలు సందర్భాలలో తెలుగు రాష్ట్రాలలో తన 'జన రాజకీయ' ప్రచార యాత్రలో ఉపయోగించారు. ఇంతకీ ఆ ఫోన్ ఏమిటంటే, 'జేపీ! మీరు అర్జంటుగా ఢిల్లీ రావాలి. అన్నాతోపాటు మీరు కూడా దీక్షలో పాల్గొంటున్నారు' అని.

'ఇంగ్లిష్‌లో అద్భుతమైన భావవ్యక్తీకరణ ఉన్నా, దేశంలోని నిజమైన ఆలోచనాపరులందరితో పరిచయం ఉన్నా, దక్షిణాదిన ఓ ప్రాంతీయ భాషా రాష్ట్రంలో ఉండటం వల్ల జేపీకి జాతీయస్థాయిలో రావాల్సిన గుర్తింపు రాలేదు, ఈ దీక్షతో జేపీకి, లోక్‌సత్తాకు జాతీయస్థాయి గుర్తింపు వస్తుంది' అన్నదే ఆ మహారాష్ట్ర నేత తాపత్రయం. ఇదే తరహాలో కాంగ్రెస్, బీజేపీ సహా పలు పార్టీల జాతీయ నేతలు గతంలో చేసిన ప్రతిపాదనను జేపీ తిరస్కరించారు. జేపీ దృష్టిలో ఢిల్లీకి ఎంత ప్రాధాన్యముందో హైదరాబాద్‌కీ అంతే ప్రాధాన్యం ఉంది. ఇవన్నీ తెలిసినా.. అన్నా దీక్ష వంటి గొప్ప అవకాశాన్ని వదులుకోకూడదనే ఆశతో మహారాష్ట్ర లోక్‌సత్తా నేత ఫోన్ చేశారు.

మిగిలిన విషయాలు అలా ఉంచితే.. అన్నా దీక్ష విషయంలో రెండు విషయాలు జేపీకి ప్రధానంగా అభ్యంతరకరంగా తోచాయి.

ఒకటి, అన్నా దీక్ష లక్ష్యమైన జన్‌లోక్‌పాల్ చట్టానికి సంబంధించినది. జన్‌లోక్‌పాల్ సర్వరోగనివారిణి, అది వస్తే దేశం రాత్రికి రాత్రి మారిపోతుంది అనే వాదనను జేపీ అంగీకరించలేదు. ఎన్నికైనవారికే పరిమితులు ఉండాల్సిన ప్రజాస్వామ్యంలో.. ప్రజల ఓటుతో సంబంధం లేకుండా నియమితులయ్యే జన్‌లోక్‌పాల్‌కు సర్వాధికారాలూ కట్టబెడితే రేపు నియంతలా తయారయ్యే ప్రమాదముందని, అలాగే అన్ని కేసుల్నీ జన్‌లోక్‌పాలే పరిష్కరించాలంటే ఏ కేసూ పరిష్కారంకాకుండా చివరికి అవినీతిపై పోరాటం అసాధ్యమనే నిర్వేదం ఆవరించే ప్రమాదం తలెత్తుతుందని జేపీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ చట్టంతోపాటు అవినీతి అంతానికి ఎన్నికల సంస్కరణల దాకా పలు చర్యల్ని చేపట్టాలని వివరించారు.

రెండోది, అన్నా ఆందోళనా పద్ధతి! నేను అడిగినది చేయకపోతే ఛస్తాను అంటూ బెదిరించే ధోరణి ఓ స్వతంత్ర దేశంలో ఉండకూడదని జేపీ స్పష్టం చేశారు. బ్రిటిష్ వారి మీద గాంధీజీ ప్రయోగించిన నిరాహారదీక్ష ఆందోళనా పద్ధతిని



### స్వచ్ఛ భారత్ సమయంలోనే మేలుకొని వుంటే..

అంతెందుకు, స్వచ్ఛ భారత్‌నే తీసుకోండి. ఆ కార్యక్రమం రూపకల్పన సరిగా లేదు, సెలబ్రిటీల ప్రచారం మీద కాకుండా స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు బదిలీ చేసేలా మార్చి అమలు చేసే మంచి ఫలితాలు వస్తాయి అని లోక్‌సత్తా మొత్తుకున్నా మోదీ వినలేదు. వేలకోట్లు ప్రచారం కోసం పందేరం చేశారు. రూ. 10,000 కోట్లు ప్రజల నుంచి పన్ను వసూలు చేశారు. చివరికి స్వచ్ఛత శూన్యం. ఇంత వైఫల్యమున్నా తాను చెలామణి చేయగలను అనే ధోరణితో ప్రధాని స్వచ్ఛ భారత్‌ను కొనసాగిస్తున్నారు. అదే నిర్లక్ష్యంతో ఇప్పుడు అవగాహన లేకుండా నోట్ల రద్దును ప్రకటించారు. స్వచ్ఛ భారత్ సమయంలోనే ప్రధాని, సమాజం మేలుకొని ఉంటే, డీమానిటైజేషన్ ప్రహసనం బారిన పడకుండానే నల్లడబ్బును, అవినీతిని కట్టడి చేసే విధానాలను అమలు చేసుకోగలిగి ఉండేవారం.

రాజ్యాంగబద్ధ స్వతంత్ర భారతంలో ఆమోదిస్తే, ప్రతి పౌరుడూ తనకు నచ్చిన డిమాండ్ కోసం ఆ పద్ధతినే ఆశ్రయిస్తారని, దీనివల్ల పరిష్కారం రాకపోగా పాలనా అచేతనత్వం, సంక్షోభం తలెత్తుతాయని అన్నారు. అయితే, అన్నా అవినీతి వ్యతిరేక ఉద్యమానికి జేపీ పూర్తి మద్దతును ప్రకటించారు. పట్టువిడుపులతో పటిష్టమైన లోక్‌పాల్‌ను సాధించుకుందామని జేపీ లోక్‌పాల్ రథయాత్రను, రౌండ్‌టేబుల్ సమావేశాలను నిర్వహించారు. అన్నాను, అప్పట్లో ఆయన ప్రధాన అనుచరులుగా ఉన్న అరవింద్ కేజ్రీవాల్, కిరణ్ బేడీ, ప్రశాంత్ భూషణ్ వంటి వారందరినీ కూడా కలుపుకుని వెళ్లే ప్రయత్నం చేశారు. చివరికి



## పన్నుల వసూళ్లు పెరిగాయి: జైట్లీ



నోట్ల రద్దు వల్ల ప్రజలు, దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొన్న మితిమీరిన కష్టనష్టాల్ని ప్రధాని మోదీ భావోద్రేక ప్రసంగాలతో, విపక్షాల మీద నెపం, ఆ పార్టీల మధ్య చీలికలతో కొట్టిపారేసే ప్రయత్నం చేయగా, ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ పెరిగిన ఆదాయాలతో మురిపిస్తూ దాటవేసే ప్రయత్నం చేశారు. రద్దయిన రూ.500, 1000 నోట్ల డిపాజిట్‌కు గడువు ముగిసిన సందర్భంగా 'నగదు చెలామణిలోకి.. దాని ప్రభావం' పేరుతో జైట్లీ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ చరిత్రాత్మక నిర్ణయం తాలూకూ ప్రయోజనాలు డిసెంబర్ 2016 నాటికే ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థలోకి మరింత నగదు వచ్చి అవి బలోపేతమయ్యాయన్నారు. 2016 ఏప్రిల్ 1నుంచి డిసెంబర్ 19 మధ్య ప్రత్యక్ష పన్నుల ద్వారా రూ.5.57లక్షల కోట్లు వసూలుకాగా, పరోక్ష పన్నుల ద్వారా (నవంబర్ 30వరకు) రూ.7.53లక్షల కోట్లు (26.2శాతం పెరుగుదల) వసూలయ్యాయని తెలిపారు. గత ఏడాది ఇదేసమయంలో ప్రత్యక్ష పన్నులు రూ.4.57లక్షల కోట్లు మాత్రమే. ఆదాయపు పన్నుల్లో 14.4శాతం పెరుగుదల నమోదై రూ.2.20లక్షల కోట్లకు పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే సరికి ప్రత్యక్ష పన్నుల ద్వారా రూ.8,47లక్షల కోట్లు, పరోక్ష పన్నుల ద్వారా రూ.7.79లక్షల కోట్లు వస్తాయని ప్రభుత్వ అంచనా అని జైట్లీ తెలిపారు.

లోక్‌సత్తా ప్రతిపాదించిన అంశాలతోనే జన్‌లోక్‌పాల్ కంటే మెరుగైన లోక్‌పాల్ చట్టం వచ్చింది.

.. ఇప్పుడు మొదట అనుకున్న ప్రశ్నల దగ్గరకు వెళ్దాం.

జన్‌లోక్‌పాల్ డిమాండ్‌ను నెరవేర్చటం వల్ల దేశం రాత్రికి రాత్రి మారిపోయిందా?.. కచ్చితంగా లేదని మనందరి అనుభవంలో రుజువైంది. జన్‌లోక్‌పాల్ అంత గొప్ప మార్పుదండమే అయివుంటే, లోక్‌సత్తా నూతన రాజకీయ సంస్కృతిని తప్పి రాజ్యాంగ వ్యతిరేక ఆందోళనాపద్ధతుల్లో రాజకీయం చేశాడన్న అపవాదును భరించైనా జేపీ జన్‌లోక్‌పాల్ నిరాహార దీక్షలో పాల్గనేవారు గదా! ఆ ఉద్యమం ద్వారా ప్రాచుర్యంలోకి వచ్చినవారు అవినీతిరహిత రాజకీయంతో దేశంలో మార్పు తేవటం మీద కన్నా పదవులు, సొంత ప్రచారం మీదే ఎక్కువ దృష్టి సారిస్తున్నారని కళ్ల ముందే కనిపిస్తోంది.

బ్రహ్మాస్త్రం అన్నట్టు ప్రచారం చేసిన జన్ లోక్‌పాల్ వల్ల చివరికి వచ్చిన ఫలితం ఇంత పరిమితంగా ఉంది!

### అన్నాలాగే వ్యవహరించిన మోదీ


జన్‌లోక్‌పాల్ విషయంలో అన్నా హజారే వ్యవహరించినట్టే పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యవహరించారు.

అన్నా హజారే కంటే మోదీకి పార్టీ రాజకీయ అవసరాలు ఉన్నా, మోదీ సదుద్దేశంతోనే నోట్ల రద్దు చేశారని నమ్మవచ్చు. తన రాజకీయ కెరీర్‌ను ఫణంగా పెట్టి ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే అన్నాకి, మోదీకి ఇద్దరికీ ఉన్న సమస్య – లోతైన అవగాహన లేకపోవటం! జాతీయోద్యమ కాలంనాటి నేతలకున్న వ్యక్తిగత నిజాయతీ, సామాజిక స్పృహ, నిరాడంబరత ఉన్నంతమాత్రాన, ఈదేశానికి మేలు చేయలేమని వారు గుర్తించలేకపోవటం లేదా అంగీకరించలేకపోవటం.

అన్నా హజారే తన జన్‌లోక్‌పాల్‌ను సర్వరోగనివారిణి అంటే.. నోట్ల రద్దును మోదీ నల్లధనం, అవినీతి రోగాలకు నభూతో అనే స్థాయి అద్భుత నివారిణి అని ప్రకటించుకున్నారు. అంశాలు వేర్వేరు అయినా.. తాము ముందుకు తెచ్చిన పరిమిత పరిష్కారాలు సర్వరోగ నివారిణి, అద్భుత నివారిణి అని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు నైతిక నియంతృత్వంతో, అవగాహనారాహిత్యంతో వ్యవహరించటంలో ఇద్దరూ దాదాపు సమానస్థాయిలో ఉన్నారు.

నల్లడబ్బు, నకిలీనోట్లు, అవినీతి అంతానికి పెద్ద నోట్ల రద్దుతోపాటు ఇతరత్రా నిర్ణయాలు కూడా తన మనసులో ఉన్నాయని మోదీ చెబుతున్నా.. నోట్ల రద్దును ఆయనో అద్భుత పరిష్కారంగా భావించారనటంలో సందేహం లేదు. అన్నిటికీ తెగించే ఈ నిర్ణయం తీసుకున్నానని తానే తేల్చిచెప్పేంత స్థాయి

నిర్ణయమిది. ఎంతో రహస్య కసరత్తు చేసి ఆయనీ నిర్ణయాన్ని ప్రకటించారు. అవినీతి అంతానికి ఎంతో చేస్తానని, విదేశీ ఖాతాలలో నుంచి ప్రతి స్వదేశీ భారతీయుడి ఖాతాలోకి లక్షల రూపాయలు వేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన మోదీ.. నోట్ల రద్దును ఆ హామీల అమలుగా భావించారు. ఈ నిర్ణయం అమలులో తలెత్తిన ఇబ్బందులను చూసి ఆయనకచాయ్ కంటే ముందు తాగిన ఉగ్గుపాలు గుర్తుకొచ్చాయని విశ్లేషకులు ఆంతరంగికంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఆయన హావభావాలు, కదలికలు కూడా ఇదే మాటను ధృవీకరించేలా ఉన్నాయి. ఈ నిర్ణయాన్ని గురించి ఆయన ఎంత గొప్పగా ఊహించుకున్నారో ఇలా అనేక విషయాలు పట్టిస్తున్నాయి.




ఓ చట్టంలో మార్పు తెచ్చే ఉద్యమం కావటం వల్ల జన్‌లోక్‌పాల్ ఆందోళన వల్ల పెద్దగా దేశ ప్రజలకు నొప్పి తెలియలేదుగానీ, డీమానిటైజేషన్ ప్రతి ఒక్కరి రోజువారీ జీవితాన్ని కుదిపివేయటంతో నాయకుల అవగాహనారాహిత్యం వల్ల తలెత్తే నష్టాలు అందరికీ అనుభవంలోకొచ్చాయి.

వ్యక్తిగత నిజాయతీ అనేది ఒక నాయకునికి ఉండాల్సిన కనీస లక్షణం. కానీ ఈ దేశానికి కావలసింది వ్యవస్థీకృత నిజాయతీ ఉన్న నాయకులు. అంటే.. ఏం చేస్తే ఈదేశంలో అత్యధికశాతం ప్రజలు నిజాయతీగా, సంతోషంగా, తలెత్తుకుని బతకగలరో అలాంటి వ్యవస్థల్ని నిర్మించటం! అంత ఆలోచనను అన్నా, మోదీ చేయలేకపోయారు. అందులోనూ భారత్ వంటి సువిశాలమైన, సంక్లిష్ట వైవిధ్యత ఉన్న దేశంలో అలాంటి వ్యవస్థల నిర్మాణానికి మరింత లోతైన ఆలోచన, ముందుచూపు కావాలి. మనదేశంలో కొన్ని రంగాలలో కొని అద్భుత నివారిణులు ఉండవచ్చేమోగానీ, దేశ రాజకీయం, పాలనా, సామాజిక వ్యవస్థల్ని మార్చటానికి మాత్రం అలాంటి సర్వరోగనివారిణులు లేవు. బహుముఖ పోరాటం, నిరంతర అప్రమత్తతో ఎప్పటికప్పుడు మార్పులు చేసుకుంటుండటమే మన ఉజ్వల భవిష్యత్తుకు భరోసా.

### మేనమామ 'జర్నలిస్టు' వ్యాఖ్యలు

గుజరాత్ పరిస్థితుల గురించి, ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా మోదీ ఉన్న సమయంలో ఆయన వ్యవహారశైలి గురించి బాగా పరిచయమున్న ఆకార్ పటేల్ అనే సీనియర్ జర్నలిస్టు డిసెంబర్, 2016లో రాసిన ఓ వ్యాసంలో.. అధ్యయనం లేకుండా నిర్ణయాలు తీసుకునే మోదీ తీరు పెద్ద నోట్ల రద్దు విషయంలో ఎంత సంక్షోభానికి కారణమైందో చెప్పుకొచ్చారు. పోస్టర్ చూసి సినిమా కథ, హెడ్‌లైన్స్ విని వార్త వివరాలు చెప్పేసే రీతిలో సునిశితత్వం, మేధస్సు తనకుందని మోదీ నమ్ముతుంటారు. తన మనసుకు నచ్చినట్టు చెప్పే, వ్యవహరించే, అన్నిటినీ మించి విశ్వాసపాత్రంగా ఉండే ఐఏఎస్ అధికారులను చుట్టూ పెట్టుకుని, వారి ఎస్ఎంఎస్ బ్రీఫింగ్‌లను వింటూ (అవి కూడా తనకు నచ్చిన అంశాలకు సంబంధించే) మెరుపువేగంతో నిర్ణయాలు తీసుకుంటుంటారు. మసాలా (సారాంశం) విని నిర్ణయాలు తీసుకునే మోదీ వ్యవహారశైలి గురించి ఇటీవలి కాలంలో తాను పునరాలోచనలో పడినట్టు ఆకార్ పటేల్ వ్యాఖ్యానించారు. గుజరాత్ స్థాయిలో ఆ వ్యవహారశైలి వల్ల నష్టం ఉండకపోవచ్చుగానీ.. ప్రధాని స్థాయిలో, పెద్ద నిర్ణయాలు తీసుకునేటప్పుడు మాత్రం ఇది సంక్షోభానికి దారితీయవచ్చన్నది ఆయన స్థూల అభిప్రాయం.

### 2014 నుంచే లోక్‌సత్తా మోదీని హెచ్చరిస్తోంది

ఈ మాటల్ని 2014 చివరి నుంచే లోక్‌సత్తా చెబుతోంది. ప్రధాని ఉద్దేశాలు మంచివే, కానీ ఆయన ఎజెండా, ప్రాథమ్యాలు, ఆచరణ అత్యంత పేలవంగా ఉన్నాయని 2015లో లోక్‌సత్తా టైమ్స్‌లోనే రెండు సార్లు ముఖచిత్ర కథనాలు వెలువడ్డాయి. "మోదీ! మిమ్మల్ని ఎందుకు ఎన్నుకున్నారో గుర్తుకుతెచ్చుకోండి" అని జేపీ పలుసార్లు సున్నితంగా హెచ్చరిస్తూ, విద్య, ఆరోగ్యం సహా నిర్మాణాత్మక ఎజెండాను మోదీకి అందిస్తూ వస్తున్నారు. కానీ అధికారం, ప్రచారం మజాను ఆస్వాదించే దశలో పాత తప్పుల్ని దిద్దుకునే అవసరాన్ని మోదీ గుర్తించలేకపోయారు. లోక్‌సత్తా వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండించిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మోదీ అభిమానులు

కొందరు ఇటీవల మాత్రం 'మీరు చెప్పింది కరెక్టే' అని అంగీకరించటం విశేషం. సరైనవాళ్ల సలహాలు తీసుకోవచ్చుగదా అని విజయవాడకు చెందిన ఓ ఉన్నత మధ్యతరగతి వ్యక్తి మింగలేని కక్కలేక మోదీనుద్దేశించి మందలింపుగా ఈ రచయితతో అన్నారు. మోదీది గుజరాత్ ముఖ్యమంత్రి స్థాయే అని ఎకసెక్కంగా అన్నారు. రాహుల్ గాంధీ సరిగ్గా వ్యవహరిస్తే.. వచ్చేసారి మాంఛి అవకాశం అని కూడా తేల్చిపారేశారు. రాజకీయాలకు దూరంగా ఉండే ఈయన తన కుమారుడు, కొందరు స్నేహితులతో కలిసి ఇటీవలే బీజేపీ సభ్యత్వం తీసుకున్నారు.

### అధికారులందు ప్రజాజీవిత అనుభవమున్న అధికారులు తక్కువయా!

నల్లధనం, అవినీతిపై పోరాటంలో ఎంతో పెద్ద నిర్ణయంగా తాను భావించిన నోట్ల రద్దు అమలును గుజరాత్‌లోలాగా కేవలం కొద్దిమంది అధికారులతో చర్చించారు. వారంతా తెలివైనవారు, నిజాయతీపరులు, వృత్తిపరమైన అనుభవం ఉన్నవారు కావచ్చు గానీ, ప్రజాజీవిత అనుభవం ఉన్నవారు కాదు. విస్తృత ప్రజాప్రయోజనాలను – సంపద సృష్టిని సమన్వయం చేసే పనిచేసినవారు కాదు. దీంతో, 86శాతం చెలామణిలో వున్న నగదును రద్దు చేస్తూ నవంబర్ 8, 2016 రాత్రి నిర్ణయం వెలువడింది. మోదీ లక్ష్యాన్ని, ఆకర్షణీయ నినాద భాషని చూసి నిర్ణయం ప్రకటించిన వెంటనే పెద్దఎత్తున ఆయన ఆశించిన స్పందనే వచ్చింది. దాంతో.. నల్లధనం, అవినీతికి ఇదో అద్భుత నివారిణి అనే ప్రచారాన్ని మోదీ, ఆయన అనుయాయులు ఉధృతం చేశారు. ప్రతిపక్షాలకు కూడా నోరాడలేదు. ఇరకాటంలోపడి మోదీ నిర్ణయాన్ని సమర్థించక తప్పని పరిస్థితిని ఎదుర్కొన్నాయి. ఎన్నికలున్న ఉత్తరప్రదేశ్‌లో బస్తాల్లో ఉన్న రూ.500,1000 నోట్ల కట్టలను మార్చుకోవటం.. ఎన్నికల ప్రచారం కన్నా ముఖ్యమైన కార్యక్రమంలా మారింది. మాయావతి పార్టీ వివరాలు బైటపడ్డాయంతే. చాలా రాష్ట్రాలలో రాజకీయ పార్టీల కలాపాలు మందగించాయి. కార్యకర్తలకు వ్యక్తిగత, పార్టీ నేతల నోట్ల మార్పిడి రోజువారీ కార్యక్రమంగా మారింది. క్రమంగా నోట్ల రద్దు ఎంత పరిమితమైన నిర్ణయమో, ఆ నిర్ణయాన్ని కూడా ఎంత అధ్వాన్నంగా అమలుచేశారో.. నగదు, చిల్లర కొరత నుంచి నకిలీ నోట్ల వరకూ అనేక పరిణామాలు వెల్లడించ సాగాయి. 80శాతానికి పైగా నగదు లావాదేవీలు, పేదరికం, అవిద్య, అసంఘటిత ఉపాధి ఉన్న భారత్ వంటి దేశంలో నోట్ల రద్దు హఠాత్ నిర్ణయం సృష్టించిన ప్రకంపనలతో మోదీ సర్వరోగనివారిణి మంత్రాన్ని వీడి కొత్త నినాదాల్ని ఎత్తుకున్నారు. ప్రతిపక్షాలు కూడా పరోక్షంగా నోట్ల రద్దుకు వ్యతిరేక గళాల్ని వినిపించటం మొదలుపెట్టాయి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ నేత మమతా బెనర్జీ నోట్ల రద్దును వెనక్కితీసుకోవాలన్న తన డిమాండ్‌ను పదునెక్కించే ప్రయత్నం చేశారు.

### ప్రజల మధ్య చిచ్చు పెట్టే భాషను ప్రధానే వాడటం

నల్లధనం, దానితో ముడిపడివున్న అవినీతిపై పోరాటంలో ముందు చేయాల్సిన చర్యలు తీసుకోకుండా కేవలం ప్రచారంతో హడావుడితో ప్రజలను విభజించే స్థాయికి సాక్షాత్తూ ప్రధానే తీసుకెళ్లారు. తమకొచ్చిన కష్టం కంటే.. డబ్బున్నవాళ్ల సొమ్ములు పోనాయి అని ఆనందించిన పేద, దిగువ మధ్యతరగతి జనాన్ని మోదీ మాటలు తొలినాళ్లలో బాగానే రంజింపచేశాయి. అలాంటి ఒకాయన నోట్ల రద్దు గురించి మాట్లాడుతూ– 'నోట్లు రద్దు చేయటంలో తప్పేమిటి? పాత నోట్లు మార్చి కొత్త నోట్లు ఇస్తున్నారు. అంతేగదా' అని తేల్చేసే ప్రయత్నం చేశారు. మోదీ అధికారంలోకి వచ్చింది 'చేస్తే తప్పేంటి?' అనే రకం పనులు చేస్తానని కాదు గదా! మోదీ కూడా నోట్ల రద్దును ఓ రొటీన్ కార్యక్రమంగా చెప్పటం లేదు. నల్లధనాన్ని, అవినీతిని అంతం చేసే విప్లవాత్మక చర్య అని ప్రచారం చేసుకుంటున్నారు. గురిచూసి కొట్టాను, తగలాల్సిన వారికే తగిలింది అని చెప్పుకుంటున్నారు. కానీ ఎన్ని కోట్ల మంది అమాయకులకు మోదీ గాయాలు చేశారు?.. ఈ మాటలకు సదరు పెద్దమనిషి జవాబుచెప్పలేకపోయారు. మళ్లీ ఆయన ఒక కళాశాలలో న్యాయవిద్యను బోధించే అధ్యాపకులు.

కానీ రోజులు గడుస్తున్నా ప్రజల కష్టాలు తీరకపోవటంతో అసంతృప్తి పెరుగుతుండటంతో మోదీ భావోద్రేకాల్ని రెచ్చగొట్టే ప్రయత్నం ప్రారంభించారు. తొలుత నీతి వర్సెస్ అవినీతి అని ప్రారంభించిన నోట్ల రద్దును, ప్రభుత్వం వర్సెస్ ప్రతిపక్షాలు, ఆ తర్వాత సంపన్నులు వర్సెస్ పేదలు స్థాయికి తీసుకెళ్లారు. తన పరువు నిలుపుకోవటం కోసం సాక్షాత్తూ ప్రధానే దేశ ప్రజలను వర్గాలుగా విభజించి, డబ్బున్నవాళ్లు సమాజానికి శత్రువులనే భావాన్ని కలిగించారు. డబ్బున్నవాళ్లు ఈ ప్రచారాన్ని పట్టించుకోకుండా తనకు, తన పార్టీ రాజకీయానికి యధావిధిగా తోడ్పాటునందించాలని ఆయన రహస్యంగా వారికి సంకేతమిచ్చి బైటపడవచ్చుగానీ, ఈ ధోరణి దేశాన్ని తిరోగమన ఆలోచన దిశగా మళ్లించేదిగా ఉంది.

## ప్రజలకు కావలసింది దొంగ - పోలీసు రాజ్యం కాదు

నల్లడబ్బుపై కఠినంగా వ్యవహరిస్తున్నామని చెప్పుకోవటం కోసం అనేకచోట్ల దాడులు చేసి పట్టుకుంటున్న మాట వాస్తవం. నోట్ల మార్పిడి అనంతరం నల్లదొంగల లావాదేవీల్ని మీడియానో, మరొకరో కాకుండా ప్రభుత్వమే వెల్లడిస్తున్న మాట కూడా వాస్తవం. కానీ దొంగలు పెరిగిపోయి వారిని పట్టుకునేందుకు పోలీసులు కేసులు మీద కేసులు పెట్టటం కాదు గదా ప్రజలు కోరుకుంటున్నది! ఎన్ని చెప్పినా నేరాలు, అవినీతికి పాల్పడే వాళ్లు ఓ ఐదుశాతం సమాజంలో ఉంటారు కాబట్టి, ఆ మేరకే పోలీసు, న్యాయవ్యవస్థలు పరిమితమయ్యే సుపరిపాలననే ప్రజలు కోరుకునేది.

## ఛాయిస్ ఏదీ?

నల్లధనం, అవినీతి, నకిలీ నోట్లు, ఉగ్రవాదం, మాదకద్రవ్యాలు, డిజిటల్ లావాదేవీలు ఇలా డీమానిటైజేషన్ లక్ష్యాలుగా ఏ మాట చెప్పినా/మార్చినా ఇవన్నీ ఒకదానితో ఒకటి ముడిపడినవే కాబట్టి ఆమోదిద్దాం. కానీ అవసరం, అనివార్యమైనవనే అనుకున్నా డిజిటల్ లావాదేవీలు కోసం భారత్ వంటి దేశంలో ప్రజలను మళ్లించే పద్ధతి ఇదేనా? ప్రజాస్వామ్యంలో పరిణతి అంటే ప్రజలకు 'ఎంపిక అవకాశాలు' (ఛాయిస్) పెరుగుతుండాలి. కానీ అసలు ఛాయిస్ లేకుండా చేసి, వాళ్లు దాచుకున్న డబ్బుని కూడా తిరిగి ఇవ్వటానికి షరతులు పెట్టటం ఎంత అప్రజాస్వామ్యకం? ప్రభుత్వం అన్నీ చేయగలదనే భ్రమలో మోదీ ప్రభుత్వం ఉన్నట్టు కనిపిస్తోంది.

## పార్లమెంటులో దొందూదొందే

ఎప్పుడూ పార్లమెంటు చర్చల్ని పెద్దగా పట్టించుకోనివారు కూడా 2016 శీతాకాల సమావేశాలలో డీమానిటైజేషన్‌పై చర్చ గురించి ఆసక్తిగా ఎదురుచూశారు. ప్రధాని సభలో మాట్లాడకుండా బైట ఎక్కడెక్కడో ప్రసంగాలిస్తూ వచ్చారు. నోట్ల రద్దులో లోపాలేమిటో, నల్లధనాన్ని, అవినీతిని నిరోధించటానికి తమ వద్ద ఉన్న ప్రత్యామ్నాయ ప్రణాళికలేమిటో చెప్పటంలో కాంగ్రెస్ సహా అన్ని ప్రతిపక్షాలూ విఫలమయ్యాయి. పసలేని ఆరోపణలు, పొంతనలేని వ్యాఖ్యలతో ప్రజల్లో మోదీ నిర్ణయం పట్ల ఉన్న అసంతృప్తిని రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకునేందుకు ప్రయత్నించాయి తప్ప నిర్మాణాత్మక పరిష్కారంతో రాజకీయం చేద్దామని వీసమెత్తు ప్రయత్నం చేయలేదు. ఈ పార్టీల నేతల్లో పలువురికి ఎన్నో నల్లధనం, అవినీతి లసుగులు ఉండటం వల్లే పైకి యుద్ధం చేస్తున్నట్టు నటిస్తూ ఆంతరంగికంగా మోదీతో రాజీపడ్డారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

## పార్టీలు, నేతల గురించి అనవసరం, ప్రజాప్రయోజనాల గురించే ఆలోచిద్దాం

ఈ నేపథ్యంలో.. 'మోదీ సెల్ఫ్ గోల్ చేసుకున్నారు. రాహుల్ గాంధీ సరిగ్గా ప్రయత్నిస్తే ప్రధాని సీటు అందుకోవచ్చు' లాంటి కామెంట్లు పార్టీలకు, కొందరు వ్యక్తులకు ఉపయోగపడతాయిగానీ ప్రజలకు వాటి వల్ల లాభమేమీ ఉండదు. నల్లధనం లేకుండా ఆర్థిక వ్యవస్థ నడవటం కష్టమనే పరిస్థితిని కల్పించి, ప్రజలకు విద్య, ఆరోగ్యం అందకుండా చేసి అత్తెసరు ఆలోచనల రాజకీయం చేతిలో పావులుగా మారే పరిస్థితిని కల్పించిన పార్టీలు, నేతల గురించి మనమెందుకు తలబద్దలు కొట్టుకోవటం?

## ప్రజాప్రయోజనాల కోణంలో నోట్ల రద్దును ఆలోచిస్తే..

నోట్ల రద్దు నిర్ణయంపై వెనకడుగుకు అవకాశం లేదు. ముందుకెళ్లటమే మార్గం. అందువల్ల ఏం చేస్తే నగదు కష్టాల్ని, వ్యాపార, ఉపాధి నష్టాల్ని గట్టెక్కొచ్చో ఆలోచించుకుని ప్రజలు ముందుకెళ్లాలి. డీమానిటైజేషన్‌లోని సానుకూలాంశాలను ఒడిసిపట్టుకుని తమ ఆదాయాలను, జీవితాలను మెరుగుపరిచే రాజకీయాన్ని, పాలనను సాధించుకోవాలి. నోట్ల రద్దులో రెండు ప్రధాన సానుకూలాంశాలున్నాయి.

1) నోట్ల రద్దు నిర్ణయంలో ధైర్యం ఉంది. మోదీ పదవిలో వున్నా లేకున్నా, ప్రధానిగా పనిచేసిన తమ నేత ఒకరు నల్లధనంపై స్వతంత్ర భారత చరిత్రలోనే అసాధారణ పోరాటం చేశారని బీజేపీ చెప్పుకోగలిగే పరిస్థితైతే ఉంది. నల్లడబ్బు, అవినీతిపరులపై మోదీ ప్రభుత్వం నేరుగా చర్యలు తీసుకునే ధైర్యాన్ని ప్రదర్శించకుండా సామాన్య ప్రజలను కూడా ఇబ్బందిపెట్టినా.. ఆ మాత్రం ధైర్యంతో ప్రజలు ఎన్నికల్లో ఓటును, ఇతర సమయాల్లో భావప్రకటనా స్వేచ్ఛను ఉపయోగిస్తే ఈదేశంలో పెనుమార్పులే సంభవిస్తాయి.

2) ఇక ముందు ఎవరూ కూడా నల్లడబ్బును పోగేసే ధైర్యం చేయరు. ఆర్థిక లావాదేవీల తీరుతెన్నుల స్థూల సమాచారమంతా ప్రభుత్వం వద్దకు చేరింది. సాంకేతిక పరిజ్ఞానం అండతో అంత మెరుపుదాడిని మోదీ నోట్ల రద్దుతో చేయగలిగారు.

## ఈ ఫలితాల కోసమా ఇంత ప్రయాస?

ప్రజల నగదు, చిల్లర కష్టాలు, రూ.లక్షల కోట్ల నష్టం, అసంఘటిత రంగంలోని వారి నష్టాలు అన్నీ తీరి పరిస్థితులు సర్దుకుంటాయనుకుందాం. సలహా ఇచ్చింది అమెరికా వాళ్లా,



## సుపరిపాలనతోనే నల్లధనం పోతుంది: ఆర్‌బీఐ

నల్లధనాన్ని శాశ్వతంగా నిరోధించాలంటే పాలనా పద్ధతుల్ని మెరుగుపరిచి ప్రజలకు నాణ్యమైన సేవలను అందించాలని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రభుత్వానికి సూచించింది. నల్లధనంపై భారీ జరిమానాలతో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాల్సిందేగానీ అతి నియంత్రణ, దండన వల్ల ఉపయోగముండదని పేర్కొంది. చట్టపరమైన కఠిన చర్యలతోపాటు సుపరిపాలనే నల్లధనాన్ని అడ్డుకోగలదని ఇటీవల విడుదల చేసిన 14వ ఆర్థిక స్థిరత్వ నివేదిక (ఎఫ్ఎస్ఆర్)లో ఆర్‌బీఐ వివరించింది. అమెరికాలో పన్ను రేట్లను ఒక శాతం పెంచితే నల్లధనంలో 1.4శాతం వృద్ధి రేటు కనిపించిందని, నియంత్రణల విషయంలో కూడా ఒక వంతు నియంత్రణలు పెరిగితే పదివంతుల సమాంతర ఆర్థిక వ్యవస్థ విస్తరించినట్టు వెల్లడైందని తెలిపింది. కఠినమైన నియంత్రణలను పెంచటం మీద కన్నా సరళమైన పన్నులు, సుపరిపాలనా పద్ధతులు, నాణ్యమైన ప్రజాసర్వీసులు, నల్లధనాన్ని పోగు చేసేవారిపై భారీ జరిమానాలు.. వంటి చర్యలతో మార్పు తీసుకురావచ్చని సూచించింది. డీమానిటైజేషన్ వల్ల డిజిటల్ లావాదేవీలతో పారదర్శకత పెరిగి బ్యాంకింగ్ రంగం పునరుత్తేజాన్ని పొందుతుందని ఎఫ్ఎస్ఆర్‌కి రాసిన ముందు మాటలో ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ అన్నారు. పెద్ద నోట్ల రద్దుతో దెబ్బతిన్న సూక్ష్మ,చిన్న పరిశ్రమలకు (దేశ జీడీపీలో 40శాతం వాటా వీటికి ఉంది) అదనపు నిర్వహణ మూలధనాన్ని బ్యాంకులు సమకూర్చాలని ఆర్‌బీఐ కోరింది. కాగా, ఎక్కువ విలువైన కరెన్సీ నోట్లను రద్దు చేస్తున్నట్టు ప్రధాని ప్రకటించటానికి ముందు కేంద్ర ఆర్థికమంత్రి, ముఖ్య ఆర్థిక సలహాదారు నుంచి అభిప్రాయాలు తీసుకున్నారా వంటి ప్రశ్నలకు సహ చట్టం కింద సమాధానాలివ్వటానికి మాత్రం ఆర్‌బీఐ అంగీకరించలేదు.

స్వదేశీయులేనా, మోదీకే తట్టిందా, చైనా వాళ్లు ఎందుకు మెచ్చుకున్నారు, కొంతమందికి ముందే లీకైందా, ముఖ్యమంత్రుల స్థాయి వ్యక్తులు కొందరు తమ నల్లడబ్బును తెలుపుగా మార్చేకున్నారా అనే విషయాలను కూడా వదిలేద్దాం. ఆశించినంత నల్లడబ్బు బైటపడలేదు, విదేశీ ఎకౌంట్లు, నగదేతర రూపంలోకి నల్లడబ్బు వెళ్లిపోయింది అనే వాస్తవాల గురించి హైరానా పడకుండా ఉందాం, పోగై ఉన్న నల్లధనాన్ని కూడా అవసరమైనప్పుడు తెలుపుగా మార్చుకోవటానికి బోలెడన్ని కంతలున్నాయి కాబట్టి దీనిపై పన్ను జరిమానాగా వచ్చే అవకాశమున్న ఒకట్రెండు లక్షల కోట్ల డబ్బుతోనే సంతృప్తి చెందుదాం. ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో లబ్ధి కోసం ప్రధాని ఈ పని చేశారా అనే అనుమానాన్ని కూడా పక్కనపెడదాం.. ఇన్ని వైఫల్యాలున్నా మోదీ సదుద్దేశంతోనే ఈ పని చేశారని, బెనిఫిట్ ఆఫ్ డౌట్‌ను ప్రస్తుతం ఆయనకే ఎటువంటి సంకోచాలు లేకుండా ఇద్దాం. ఎక్కువమంది ప్రజలు కూడా ఇదే అభిప్రాయంతో అనారోగ్య, ఆర్థిక సమస్యల్ని ఎదుర్కొంటూ సైతం (దేశ ఆరోగ్య సంక్షోభాన్ని కూడా ఒకరకంగా డీమానిటైజేషన్ బైటపెట్టింది) ఎక్కడా హింసకు పాల్పడలేదు.. ఇంత సానుకూలంగా భావించినా కూడా ఎందుకోసం ఇంత ప్రయాస అన్న ప్రశ్న ఏదైతే తలెత్తుతోందో అదీ అసలు సమస్య.

సరైన రాజకీయం చేయటం చేతగానివారే వ్యవస్థల్లో మార్పు అంటూ మాట్లాడతారని ఇప్పుడు ఆర్థికమంత్రిగా ఉన్న అరుణ్‌జైట్లీ ప్రతిపక్షంలో ఉండగా ఒకసారి ఓ టీవీ ఛానల్ చర్చలో వ్యాఖ్యానించారు. రాజకీయం తప్ప వ్యవస్థీకృత మార్పు గురించి తెలియకపోతే ఎన్ని అనర్థాలు వస్తాయో ఇప్పటికి ఆయనకు బోధపడి ఉంటుంది. నిర్ణయం మోదీదైనా, ఆర్థికమంత్రిగా జైట్లీ, రిజర్వుబ్యాంకు గవర్నర్‌గా ఉర్జిత్ పటేల్ బాధ్యతల నుంచి తప్పించుకోలేరు. ''కొంతమంది అవినీతిపరులను శిక్షించటం చేతగాక మమ్మల్ని ఇబ్బంది పెడతారా? దీనికంటే ఆ అవినీతిపరుల్ని ఎలాగోలా భరించటమే మేలన్నట్టుంది.'' అని నోట్ల రద్దును తొలుత సమర్థించిన ప్రజలు కూడా తిట్టుకునే పరిస్థితి ఏర్పడినా జైట్లీ ఇంకా గుడ్డిగా నోట్ల రద్దు అద్భుత నిర్ణయమనే చెబుతున్నారు. నల్లధనాన్ని, అవినీతిని అంతం చేయటానికి తగిన వ్యవస్థీకృత సంస్కరణల్ని తీసుకురావటం, పన్నుల వ్యవస్థను విస్తరించుకోవటానికి ప్రజలకు సరైన సేవలు అందించటం చేతగాక ఇలాంటి మార్గాన్ని ఆశ్రయించారంటే మంత్రి సమాధానం ఇవ్వగలరా?

### ప్రజల మనసుల్లోని ప్రశ్నను సరిగా అర్థం చేసుకోవటం మీదే భవిష్యత్తు

మోదీ సదుద్దేశంతో చేసిన నిర్ణయాన్ని స్వాగతించాం, రోజుకో రూలు చొప్పున మారుస్తూ (45 రోజులలో 60 కొత్త నిబంధనలు) అమలులో ఎన్ని కష్టాలు పెట్టినా సహించాం.. కానీ మోదీ గొప్పగా చెబుతున్న ఫలితం ఏం వచ్చింది దీని వల్ల? అని ప్రజల మనసుల్లో ఏర్పడిన ప్రశ్నను సరిగా అర్థం చేసుకోవటంలోనే మోదీ భవిష్యత్తు, ఒకరకంగా ఈ దేశ

భవిష్యత్తు ఆధారపడి ఉన్నాయి. డీమానిటైజేషన్ జరిగినా ఎన్నికల్లో నల్లడబ్బు ఆగదని ఇప్పటికే సర్వేలు చెబుతున్నాయి.

**మోదీ ప్రభుత్వం అనివార్యంగా చేయాల్సిన సంస్కరణలు**

డీమానిటైజేషన్ కంటే ముందే చేయాల్సిన ఈ ఐదు సంస్కరణలను కనీసం డీమానిటైజేషన్‌కి కొనసాగింపుగానైనా మోదీ ప్రభుత్వం చేపడితేనే ప్రజల మనసుల్లో నెలకొన్న 'ఎందుకీ ప్రయాస?' అన్న ప్రశ్న తొలగిపోయి కష్టానికి తగ్గ ప్రతిఫలం దొరికిందని సంతృప్తి చెందుతారు. మోదీ కూడా తాను చేసిన ఓ తొందరపాటు చర్యను దిద్దుకున్నట్లవుతుంది.

1) డిజిటల్ వల్ల నల్లధనం తగ్గినా పన్నుల పరిధి పెరిగి దాదాపు అందరూ ఏదో ఒకరకంగా పన్నులు చెల్లించాల్సి వస్తుంది కాబట్టి.. పన్నుల తగ్గింపును, పన్నులకు తగ్గ సేవలు అందించటాన్ని స్పష్టమైన రోడ్‌మ్యాప్‌తో అమలు చేయాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు లేకుండా (ఆన్‌లైన్ సేవలున్నా, నగదు రహితమైనా లంచాలు తీసుకునే నైపుణ్యాలు ఉద్యోగుల్లో పెరుగుతున్నాయి) సేవలు అందించేలా 'పౌర సేవల' (సర్వీస్ గ్యారంటీ) చట్టం తీసుకురావాలి. ప్రజలు ఇష్టపూర్వకంగా పన్నులు చెల్లించేలా ప్రభుత్వ సేవలు అందకపోతే.. ముున్ముందు ఎగవేతకు కొత్త మార్గాల్ని కనుగొంటారు. డీమానిటైజేషన్‌తో సేకరించిన నగదు లావాదేవీల సమాచారాన్ని వేధింపుల కోసం కాకుండా విజ్ఞతతో ఇలా పన్నుల సంస్కరణలకు ప్రభుత్వం వినియోగించాలి.

2) నల్లడబ్బుకపోగుపడటానికి కారణమవుతున్న రియల్ ఎస్టేట్ రంగంలో లావాదేవీలను సంస్కరించాలి. స్టాంప్ డ్యూటీని తగ్గించి, భూముల విలువను మార్కెట్‌కు దగ్గరగా సవరించాలి. అమ్మకపు ఆదాయంపై పన్నును తొలగించాలి.

3) రియల్ ఎస్టేట్ రంగంలో సంస్కరణల్ని ఒక్క కలంపోటుతో చేయవచ్చుకానీ, కష్టమైన ఎన్నికల సంస్కరణలను సాధించటం కోసం గట్టి సంకల్పం, అందరినీ కలిపే నైపుణ్యం కావాలి. కానీ ఈ సంస్కరణల్ని చేయకుంటే ఎప్పటికీ నల్లధనం, అవినీతి ఆగవు. నల్లడబ్బుకి మూలం ఎన్నికల వ్యవస్థలోనే ఉంది. పార్టీల నిధుల సేకరణ, ఎన్నికల ఫండింగ్‌లో సంస్కరణలు తేవాలని ప్రయత్నిస్తున్నట్టు ప్రధాని కూడా చెబుతున్నారు. కానీ ఒకేసారి ఎన్నికలు, ప్రభుత్వమే ఎన్నికల ఫండింగ్ ఇవ్వాలి వంటి అరకొర ఆలోచనల్నే మళ్లీ ఆయన చెబుతున్నారు. మనకున్న సమస్య ఎన్నికల ప్రచారం కన్నా కూడా ఓట్ల కొనుగోలు. అది సామాన్య ప్రజల స్థాయి నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల దాకా విస్తరించి ఉంది.

ఐదేళ్ల వ్యవధిలో రూ. 1,00,000కోట్ల వరకూ నల్లడబ్బు మన ఎన్నికలలో ఖర్చు చేస్తున్నట్టు అంచనా అయితే, ఇందులో చాలా భాగం ఓట్ల కొనుగోలుకే వెచ్చిస్తున్నారు. ఇలా గెలిచి రూ. 10,00,000 కోట్ల వరకూ అవినీతికి కారణమవుతున్నారు. ఈ నేపథ్యంలో లోతైన అవగాహనతో, ముందుచూపుతో, ఏకాభిప్రాయ సాధనతో ఇక్కడ సంస్కరణలు చేయాలి. ఎన్నికల్లో నల్లడబ్బుకు చెక్ పెట్టటానికి దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వంటి మార్పులతో నల్లడబ్బును ఎన్నికల్లో నిరోధించాలి. విదేశీ ఎకౌంట్లు, నగదేతర ఆస్తుల రూపంలోకి అవినీతి సొమ్మును మళ్లించిన ఆస్తుల్ని జప్తు చేసే చట్టం రూపొందించాలి.

4) ప్రభుత్వం సర్వాధికారి, ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులు అన్నీ చేయగలరు అనే 1960-70లనాటి భ్రమల నుంచి మోదీ బైటికి రావాలి. స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు కూడా కేటాయిస్తే క్రమంగా ప్రజలు ఓట్ల కొనుగోలు రాజకీయం నుంచి బైటపడి పరిణతి గల ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్మించుకుంటారు. మంచిని ప్రోత్సహిస్తూ, చెడును నిరుత్సాహపరిచే ప్రభుత్వాలను ఎన్నుకుంటారు.

5) డిజిటల్ ఆర్థిక లావాదేవీలు దేశానికి అవసరమే. కానీ అనీతిరహిత వ్యవస్థల్లో ప్రపంచదేశాల మధ్య మనం 76వ స్థానంలో ఉంటే, మొదటిస్థానంలో ఉన్న డెన్మార్క్ వంటి దేశాల్లో పరిస్థితిని చూడండి. అక్కడ అవినీతి తగ్గడానికి కేవలం సాంకేతిక పరిజ్ఞానమే కారణం కాదు. ఆ మాటకొస్తే నగదును ఎక్కువగానే ఉపయోగిస్తున్న జర్మనీలో అవినీతి తక్కువగా ఉంటే, క్యాష్‌లెస్/డిజిటల్ ఎకానమీ ఉన్న సోమాలియా వంటి దేశాల్లో అవినీతి తాండవిస్తోంది. డెన్మార్క్‌లో అవినీతి నామమాత్రం కావటానికి ప్రధాన కారణం - అక్కడ ప్రజలకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం, తలెత్తుకుని బతికే ఉపాధి అవకాశాలు. ఈ ఎజెండాను అమలు చేయకుండా నల్లధనం, అవినీతిని పోగొడతానని మోదీ ప్రభుత్వం అంటే ఈ దేశాన్ని ఇంకా ఇంకా మోసం చేయటమే. అవినీతి అంతంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిగా అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి అందించే కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపట్టాలి.

పులిని జూలో ఫోటో తీసే స్థాయి నుంచి పులి మీద స్వారీ చేసే ధైర్యాన్ని డీమానిటైజేషన్ నిర్ణయంతో ప్రదర్శించారు. తన నిర్ణయం అమలులో పలు కీలక రాష్ట్రాల ముఖ్యమంత్రుల మద్దతును కూడగట్టారు. కానీ ఏమాత్రం తేడా వచ్చినా

## ఆర్‌బీఐ గవర్నర్, ఆర్థికమంత్రి పాత్రల్లో ప్రధాని



డీమానిటైజేషన్ గడువు ముగిశాక ప్రధాని చేసిన ప్రకటనలు ఎక్కడా నవంబర్ 8నాటి నోట్ల రద్దు ప్రకటన స్థాయి ఉత్సాహంతో లేవు. ఏం సాధించాం అంటే.. నల్లడబ్బుతో సంబంధం లేకుండా మొత్తమ్మీద డబ్బంతా చెలామణిలోకి వచ్చి బ్యాంకులు పుంజుకున్నాయి, వడ్డీ రేట్లు తగ్గుతాయి, డిజిటల్ లావాదేవీలతో పన్ను ఆదాయాలు పెరుగుతున్నాయి అని మాత్రమే చెప్పగలుగుతున్నారు. తాయిలాలు హామీ ఇవ్వకుండా అధికారంలోకి వచ్చిన మోదీ.. డీమానిటైజేషన్ అసంతృప్తిని చల్లార్చటానికి కూడా మాఫీ తాయిలాల్ని ప్రకటించకుండా కొంత ముందు జాగ్రత్తను పాటించారు. కులం, మతం, ప్రాంతం, భాష వంటివాటికన్నా ఎన్నికల్లో ఆర్థికాంశాల గురించి ప్రజలు ఆలోచించేలా చేయగలిగారు. కానీ ఆర్‌బీఐ గవర్నర్‌లా ప్రకటనలు, ఆర్థికమంత్రిలా మాటలతో బడ్జెట్ స్పీచ్‌లు ఇవ్వటం మాత్రం మానుకోలేదు. అలాగే అసంఘటిత రంగంలో దెబ్బతిన్న అందరికీ కాకపోయినా.. నిరుపేదలకు ఏదోకరూపంలో కొంత నిర్మాణాత్మక ఆర్థికసాయం అందించివుంటే బాగుండేది. ఉచితంగా కనీస ఆదాయం (ఎంబీఐ) వంటి వాటి పేరుతో ముమ్ముందైనా ఆలోచిస్తారేమో చూడాలి. లోక్‌సత్తా గతంలోనే చెప్పినట్టు.. చదువు, ఆరోగ్యం, ఉద్యోగాలు ఇవ్వని రాజకీయ పాపం కొనసాగే దేశంలో ఉచితంగా ఎంబీఐ – స్మార్ట్‌ఫోన్ – మద్యం సీసా వంటి స్కీములే మిగులుతాయి. తాయిలాలేవీ ఇవ్వకుండా ఎంబీఐ విధానం మాత్రమే అయితే కొంత మెరుగు అనుకోవచ్చు.. అసాధారణమైనరీతితో 2014లో ఎన్నికైన మోదీ తొలి ఏడాది మౌలిక మార్పులు తేవటానికి ఎంతో అవకాశమున్నా జారవిడుచుకున్నారు. శారదా కుంభకోణం, ఓటుకు కోట్లు కేసు, వాద్రాపై కేసులు వంటి వాటిల్లో ఒక్కటంటే ఒక్క కేసులో దోషులను శిక్షించేలా ప్రధాని వ్యవహరించలేకపోయారు. అత్యంత అవినీతిపరులైన ఉన్నతాధికారులను ఏమీ చేయలేకపోయారు. తాజాగా కూడా.. తమిళనాడులో అత్యున్నతస్థాయిలో కుంభకోణాలపై రాజకీయ బెదిరింపుల ధోరణితో వ్యవహరిస్తున్నారు. చివరికి అవినీతిపై బ్రహ్మాస్త్రమంటూ డీమానిటైజేషన్ నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ నిర్ణయం వెనక సదుద్దేశం, సాహసం ఉన్నా.. దీని వల్ల నల్లధనం, అవినీతి దేశం నుంచి పోతుందా అంటే ప్రభుత్వమే చెప్పలేకపోతోంది. అధికారంలోకి వచ్చినవారిలో ఎవరో ఒకరు అవినీతిపై ఏదోకస్థాయిలో ఎంతో కొంత ధైర్యంగా పోరాడుతున్నారని మోదీకి ప్రజలు మద్దతిస్తున్నారు. కుంభకోణాలు, వంశపారంపర్య రాజకీయాలు, చీలికల ప్రతిపక్షాల మధ్య.. అవినీతిపై పోరాడుతున్న నాయకుడిగా దేశంలోని మారుమూల ప్రాంతాలలో కూడా కొంత గుర్తింపు తెచ్చుకోవాలనే లక్ష్యంలో మోదీ సఫలమయ్యారు. అందుకే మోదీ నిర్ణయం పట్ల సలసల కాగుతున్న ఆయన పార్టీవారు, మిత్రపక్షాల వారు కూడా పైకి మోదీ భజన చేస్తున్నారు. కానీ నల్లధనం, అవినీతి మళ్లీ కొనసాగుతుంటే ప్రజల్లో అసమ్మతి పెరిగి, కొంతయినా రాజకీయ ప్రత్యామ్నాయం ఏర్పడితే.. మోదీని దెబ్బతీద్దామని ఆయన చుట్టూనే కాచుకుని ఉన్నవారికి అస్త్రం లభిస్తుంది. అందుకే మోదీ 2017లో ప్రజలకు నిర్మాణాత్మకంగా మేలు చేసే వడ్డీ రేట్లు, పన్నుల తగ్గింపు పథకాలను ప్రకటిస్తూనే.. కొనసాగింపుగా పన్నులకు తగ్గ సేవలు, రియల్ ఎస్టేట్ రంగ ప్రక్షాళన, ఎన్నికల సంస్కరణలు, స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు, అందుబాటులోకి నాణ్యమైన విద్య, ఆరోగ్యం సంస్కరణల్ని తీసుకురావటం దేశానికి, ఆయన పార్టీకి కూడా మేలు చేస్తుంది. ఈ సంస్కరణల్ని అమలు చేస్తే వీటి ముందు పెద్ద నోట్ల రద్దు చర్య ఎంత వెలవెలబోతుందో, అది ఎంత పరిమిత చర్యో మోదీయే స్వయంగా అంగీకరిస్తారు. నోటు కష్టాల వల్ల ఫలితం లేదని ఆగ్రహంతో ప్రజలు ఓటుతో దెబ్బతీయకుండా, నోటు – ఓటు మధ్య దేశం నష్టపోకుండా ఈ సంస్కరణల కోసం అందరినీ కలుపుకునే రుషిత్వాన్ని, ఆలోచనా పరిణతిని మోదీ ప్రదర్శించాలి.

వాళ్లు కాడిపారేస్తారు. అంతెందుకు, వచ్చే ఎన్నికల్లో ప్రజల్లో అసంతృప్తిని పోగొట్టటానికి నెపం మోదీ మీద నెట్టటానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు ఏమాత్రం సందేహించరు. మోదీ చేసిన ఆర్థికనష్టం వల్లే అభివృద్ధి పనులు అనుకున్నట్టు చేయలేకపోయామని నమ్మబలికినా ఆశ్చర్యపోనక్కర్లేదు. కాబట్టి పార్టీ రాజకీయాలపరంగా ఆలోచించినా కూడా మోదీ డీమానిటైజేషన్‌కి కొనసాగింపుగా పైన పేర్కొన్న చర్యల్ని చేపట్టటమే మేలు.

**అమెరికావాళ్లూ అబ్బురపడే మేధో నాయకులు మనకున్నారు, విని యోగించుకోండి**

అనాలోచితంగా వ్యవహరించే తన ధోరణి వల్ల ఎన్ని సమస్యలు వస్తాయో ఎట్టకేలకు మోదీ కూడా కొంతమేర గుర్తించినట్టు చెబుతున్నారు. ఆయన గతంలోలా అధికారుల మసాలా బ్రీఫింగ్ మీదే ఆధారపడకుండా తాను కూడా చదవటం


మొదలుపెట్టారట. తన వద్దకు వచ్చిన ప్రతి విషయాన్నీ మనసుపెట్టి చదివి సొంతంగా అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారట. ఆయన పాక్షికంగా, తాత్కాలికంగా మారితే సరిపోదు, పూర్తిస్థాయి పరివర్తన చెందాలి. అధ్యయనాన్ని ఇక మీదట రోజువారీ కార్యక్రమంగా మార్చుకోవాలి. మంచి ఆలోచనలను, సృజనాత్మక, నిర్మాణాత్మక పరిష్కారాలను తోటి భారతీయుల నుంచి తీసుకోవటం నేర్చుకోవాలి. అలాగే సదుద్దేశంతోనే డీమానిటైజేషన్ వంటి సలహాలిచ్చేవారూ ఉంటారు.. ప్రతి సలహానీ లేదా సొంత ఆలోచననూ బహుముఖంగా విశ్లేషించుకుని ఆచితూచి వేగంగా నిర్ణయాలు తీసుకోవాలి. వివేకానంద (నరేంద్రుడు), వల్లభాయ్ పటేల్‌లాంటి వారి నుంచి స్ఫూర్తిని పొందటం అవసరంగానీ, తనను వారి లాగా ఊహించుకుని ఆరోజు వాళ్లు చేసిన పనుల్నే యధాతథంగా ఇప్పుడు చేస్తానంటే అభాసుపాలవుతారు.

తాను అవినీతి వ్యతిరేక పోరాటయోధునిగా, రుషితుల్యమైన మహానేతగా, మాస్ లీడర్‌గా ఎదుగుతానని, కాంగ్రెస్‌కు పలువురు జాతీయోద్యమ నాయకుల వారసత్వం ఉన్నట్లే బీజేపీకి తానో గొప్ప నాయకుడిగా అవతరిస్తానని, కేజ్రీవాల్ వంటి వారికి అవకాశం లేకుండా కాంగ్రెస్ వ్యతిరేక ఓటునంతా లాక్కోగలుగుతానని ప్రధాని భావిస్తుండవచ్చు. ఇందిరాగాంధీ స్టయిల్లో వ్యవహరిస్తూ.. ప్రజలది షార్ట్ మెమోరీ, ఎన్నికల సమయానికి డీమానిటైజేషన్ కష్టాల్ని మర్చిపోతారనుకుంటుండవచ్చు. కానీ దేశాన్ని సుదీర్ఘకాలం ప్రభావితం చేసే, జనం మర్చిపోవాలన్నా మరచిపోలేని పరిణామమిది. తనకు తెలియకుండానే అసంకల్పితంగా అలాంటి చర్యకు మోదీ కారకులయ్యారు.

అమెరికా సహా అభివృద్ధి చెందాయని మనం అనుకుంటున్న అనేక దేశాలు కూడా అబ్బురపడే గొప్ప ఆలోచనాపరులు, ప్రజాసేవాతత్పరులు కొందరైనా మనకున్నారు. వారి సేవల్ని మనస్ఫూర్తిగా వినియోగించుకునే విశాలతత్వాన్ని, నిబద్ధతతని మోదీ ప్రదర్శించాలి. పైన పేర్కొన్న సంస్కరణలతో వ్యక్తిగత సామర్థ్యం కన్నా వ్యవస్థీకృత సామర్థ్యాన్ని ప్రదర్శించటం మీద దృష్టి పెట్టాలి.

**నిజాయతీగల థాట్ లీడర్స్‌నే ఎన్నుకుందాం**

ఇలా అనాలోచిత నిర్ణయాల సంస్కృతి నుంచి మోదీ, మన రాజకీయ వ్యవస్థ మాత్రమే కాదు.. ప్రజలు కూడా బైటపడాలి. ఎన్ని వివరణలిచ్చినా.. నోట్ల రద్దు నిర్ణయం అనాలోచితంగా జరిగిందని, చాలా విషయాలపై ప్రభుత్వంలో ఉన్నవారికి అవగాహన కూడా లేదని స్పష్టంగా అర్థమవుతోంది. ఆలోచించటం రాజకీయాలలో ఒక అనర్హత, ఫ్యాషన్‌గా




మార్చేసుకోవటం వల్ల జరిగిన అనర్థం ఇది. విజ్ఞులు, మేధావులు రాజకీయాలలోకి రాకూడదు అని మనం తీర్మానించుకోవటం వల్లే ఉన్నట్టుండి ఇంత సంక్షోభం తలెత్తింది. ఇలాంటి అనర్థాలు విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి అనేక రంగాలలో నిత్యం జరుగుతున్నా, ఈ స్థాయిలో మన కళ్లు తెరుచుకునేలా చేసింది మాత్రం డీమానిటైజేషన్ హఠాత్ పరిణామమే. మనదేశాన్ని నియంతలు పాలించాలి అని భ్రమపడేవారి కళ్లను కూడా తెరిపించిందీ పరిణామం.

అధ్యయనం చేయటం, తగినవారి సలహాసూచనలు తీసుకోవటం, ఆ తర్వాత ఆలోచించి నిర్ణయాలు తీసుకోవటం అనే సంస్కృతి రాజకీయాలలో పెరగాలి. సరైన ఆలోచన, ముందుచూపు లేకుండా ఉద్వేగాలు, సానుభూతులు, సహానుభూతులకే పరిమితమయ్యే రాజకీయ నాయకులు ఎంత గొప్పగా అనిపించినా వారిని పక్కనపెట్టటమే మేలు.

మీ ప్రధానమంత్రి మంచి చేయాలనే తపనకలవాడు, మాటకారి, ధైర్యవంతుడేగానీ.. తెలివిలేనివాడు అంటే మనకి ఎంత అప్రతిష్ఠ!

తనకు ఎంత పరిజ్ఞానమున్నా డా॥ జేపీ ప్రతిరోజూ అధ్యయనం చేస్తుంటారు. తనకు తెలియని విషయాన్ని నిపుణులతో చర్చించి నివృత్తి చేసుకుంటారు. ప్రపంచంలో అత్యుత్తమ ఆలోచనలు ఏ పుస్తకంలో, ఏ వ్యక్తి దగ్గర ఉన్నా తెలుసుకునేందుకు వేగంగా ప్రయత్నిస్తారు. జేపీ కంటే మేధావులుంటారు అని కూడా అనుకోవచ్చుగానీ, ఒక పరిజ్ఞానాన్ని విస్తృత ప్రజాప్రయోజనాలకనుగుణంగా సమన్వయపరిచే నాగరిక నైపుణ్యంలో మాత్రం జేపీతో

## నోట్ల రద్దులోని మంచిని తీసుకుని ముందు కెళ్లాల్సిందే : యూనస్




అవినీతి, నల్లధనంపై యుద్ధంలో పెద్ద నోట్ల రద్దు ఓ అడుగు మాత్రమేనని బంగ్లాదేశ్‌కు చెందిన ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ అన్నారు. నల్లధనం మూలాలను కనుక్కొని దాడి చేస్తే తప్ప ఆ సమస్య పరిష్కారం కాదన్నారు. పెద్ద నోట్ల రద్దు వల్ల నల్లధనం పోగేసుకున్నవారు, అవినీతిపరుల భూములతో పాటు పాటు రైతులు, ఇతర సామాన్యుల భూములకు కూడా ధరలు తగ్గుతాయన్నారు. దీనిపై వెనక్కి వెళ్లే అవకాశం లేదు కాబట్టి మంచిని మాత్రం తీసుకుని ముందు కెళ్లాల్సిందేనన్నారు. డిజిటల్ లావాదేవీలకు మళ్లేందుకు ఇదో అవకాశమన్నారు. అయితే బలవంతంగా దీన్ని ప్రజలపై రుద్దకుండా.. డిజిటల్ సులభం, లాభదాయకం అనే భావనను ప్రజలలో కలిగించాలన్నారు. తన దేశం కష్టాలలో ఉండటంతో యువకుడిగా ఉన్నప్పుడే మార్పు కోసం పోరాటం ప్రారంభించానని, భారత్‌లో వేగంగా మార్పు తేగల శక్తి యువత చేతుల్లోనే ఉందని అన్నారు. వస్త్రరంగంలో చైనా నుంచి అవకాశాలను భారత్ కంటే ముందుచూపుతో వేగంగా అందుకున్న బంగ్లాదేశ్.. విద్య, ఆరోగ్యంతో ముడిపడిన మానవాభివృద్ధిలో కూడా మనకంటే ముందంజలో నిలవడంలో యూనస్ స్థాపించిన గ్రామీణ బ్యాంక్ కీలకపాత్ర వహించింది.

సాటిరాగలవారు ప్రపంచంలోనే బహుఅరుదుగా కనిపిస్తారు.

చదువుకున్నవారు, తెలివైనవారు మోసం చేయటం లేదా? అన్నీ తెలిసిన మన్మోహన్‌సింగ్ హయాంలోనే గదా స్వతంత్ర భారతచరిత్రలోనే భారీ కుంభకోణాలు చోటుచేసుకుంది? అని సందేహం రావచ్చు. కానీ అవినీతి జరగకుండా వ్యవస్థీకృత ఏర్పాట్లను కూడా చేసుకోవాలి తప్ప చిట్కాలతోనో, మంత్రాలతోనో పరిష్కారాలు రావు. మన్మోహన్ సింగ్ కూడా వ్యక్తిగతంగా నిజాయతీపరుడే, కానీ దేశానికి కావలసింది వ్యవస్థీకృత నిజాయతీ.

అందుకే మేలుకొందాం.. డీమానిటైజేషన్‌కి కొనసాగింపుగా పన్నులు, అవినీతి నిరోధక చట్టాలు, ఎన్నికల వ్యవస్థల్లో సంస్కరణల్ని తెచ్చుకుందాం. అధికారాన్ని వికేంద్రీకరించి స్థానిక ప్రభుత్వాలకు సాధికారతను సాధించుకుందాం. డీమానిటైజేషన్ వల్ల మిగిలే సొమ్మును, పెరిగే పన్నుల డబ్బును సద్వినియోగం చేస్తూ విద్య, ఆరోగ్యం వంటి మౌలిక రంగాలను బాగుచేసుకుందాం. ఆలోచన, ముందుచూపు, నిజాయతీ ఉన్న థాట్ లీడర్స్‌నే ఎన్నుకుందాం. ఇప్పుడున్న రాజకీయ పార్టీలు ఆరకంగా మారకపోతే, వాటిని మార్చేసి కొత్త రాజకీయం చేసే పార్టీల్ని, నేతల్నే ఎన్నుకుందాం.

## లోక్‌సత్తా నేత అకాల మృతి పట్ల జేపీ ప్రగాఢ సంతాపం



లోక్‌సత్తా పార్టీ నేత, సిద్దిపేట జిల్లా కోహెడ మండలం సముద్రాల గ్రామ సర్పంచ్ బొల్లం రవి (35) అకాల మృతి పట్ల లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

నగదు కోసం జనవరి 2, 2017న కోహెడ మండలకేంద్రంలో ఏటీఎం వద్ద నిలబడిన రవి అక్కడున్న కానిస్టేబుల్‌తో జరిగిన గొడవలో గాయపడి కుప్పకూలిపోయారు. తలపై దెబ్బలతో కోమాలోకి వెళ్లిన రవిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించారు. రవి అవయవాలను కుటుంబసభ్యులు జీవన్‌దాన్‌కి అందచేశారు.


విద్యార్థి దశ నుంచి రాజకీయాలలో ఉన్న రవి.. లోక్‌సత్తా ఉద్యమ సంస్థలో, పార్టీలో కూడా చురుగ్గా పనిచేశారని, సముద్రాల గ్రామం అభివృద్ధికి తోడ్పాటు కోసం తరచూ సంప్రదిస్తుండేవారని జేపీ గుర్తుచేసుకున్నారు. హైదరాబాద్ శేరిలింగంపల్లిలో పార్టీ నిర్మాణం కోసం రవి పనిచేశారు. 2009లో హఫీజ్‌పేట్ నుంచి కార్పొరేటర్‌గా, 2014లో కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. స్వగ్రామంలో సేవా చేయలనే భావంతో ఆ తర్వాత సముద్రాలలో సర్పంచ్‌గా పోటీ చేసి పార్టీలకతీతంగా గెలిచారు. రవి అకాల మరణం లోక్‌సత్తాకు, సమాజానికి కూడా పెద్ద నష్టమని ఆయన కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉంటామని జేపీ ప్రగాఢ సంతాపం తెలియచేశారు.

# బినామీ చట్టం బ్రహ్మాస్త్రమా.. ప్రచారాస్త్రమేనా?

ఆధునిక ఆర్థిక అవకాశాలు, పాతకాలపు రాజకీయం మధ్య నలుగుతూ అనేక అవకాశాల్ని కోల్పోతున్న భారతదేశం బినామీ ఆస్తుల జప్తు చట్టం విషయంలో కూడా చాలా ఆలస్యంగా మేలుకొందనే వాదనలు వినిపిస్తున్నాయి. భూముల రికార్డులు అధ్వాన్నంగా ఉన్న దీర్ఘకాల సమస్యతో పాటు.. విదేశీ ఆస్తులు, ఎకౌంట్ల ద్వారా తేలిగ్గా నల్లడబ్బును తెలుపుగా మార్చుకునే అవకాశాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగిన ప్రస్తుత తరుణంలో బినామీ చట్టం బ్రహ్మాస్త్రమనుకోవటం భ్రమే కావచ్చంటున్నారు. బినామీ ఆస్తుల సమాచారం దగ్గర్నుంచీ.. అమలులో ఎదురయ్యే ఇబ్బందులు చట్టాన్ని నీరుగార్చవచ్చంటున్నారు. నల్లడబ్బు నిరోధానికి, రియల్ ఎస్టేట్ రంగాన్ని సంస్కరించి అందరికీ ఇంటి సదుపాయం అందించే క్రమంలో.. కచ్చితంగా బినామీ ఆస్తుల జప్తు చట్టం రావటం అవసరమేగానీ, దాన్నో భారీ అస్త్రంగా చెప్పటం కేవలం ప్రచారవ్యూహమే, అవినీతిపై పోరాడుతున్నట్టు ప్రజల్ని నమ్మించటానికి చేసే కార్యక్రమమే అని వస్తున్న విమర్శల్ని కొట్టివేయలేం.

దేశం వెలుపల దాదాపు రూ. 70లక్షల కోట్ల నల్లధనం ఉందన్న అంచనాలను అంగీరించినా, వాటిని వెనక్కి తీసుకురావటం అంత తేలిక కాదు. అలాగే మనదేశంలో ఏటా రూ. 20–30లక్షల కోట్ల నల్లధనం పోగవుతోంది. విదేశాల నుంచి నల్లధనాన్ని తెచ్చే ప్రయత్నాల మీద కంటే.. ముమ్మందు మనదేశం నుంచి నల్లధనం బైటికి తరలకుండా ఆపటం, నల్లధనం మార్గాల్ని అరికట్టటం ముఖ్యం. గతంలో మనది పేద ఆర్థికవ్యవస్థ. ఇప్పుడిప్పుడే మనం ఆర్థికపరంగా ఎదుగుతున్నాం. కాబట్టి వెళ్లిన డబ్బుకన్నా, ఇకముందు డబ్బు అక్రమంగా తరలి వెళ్లకుండా చూడటం చాలా ముఖ్యం. ఈ వాస్తవాల్ని, ప్రపంచీకరణ ఆర్థిక వ్యవస్థని దృష్టిలో పెట్టుకుంటే.. బినామీ చట్టం కంటే కూడా వేగంగా అవినీతి నిరోధక వ్యవస్థల్ని పటిష్టం చేయటంతోపాటు అధికారాన్ని వికేంద్రీకరించటం, ఎన్నికల సంస్కరణల్ని తేవటం వల్ల నల్లధనం కట్టడి జరుగుతూ ప్రజలకు ఎక్కువ లాభం ఉంటుంది. ఇందులో భాగంగా..


- దేశ ప్రయోజనాలకు నష్టం కలిగించేలా కుమ్మక్కయి లంచాలిచ్చే, పుచ్చుకునేవారి మీద కఠినమైన చర్యలు తీసుకోవాలి
- ఇలాంటి లాలూచీ అవినీతిలో నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే బాధ్యతను నిందితులపైనే ఉంచాలి
- అవినీతిపరుల బినామీ ఆస్తులనే కాకుండా.. మొత్తం ఆస్తులన్నిటినీ జప్తు చేయాలి. కుటుంబ వ్యవస్థ బలంగా



ఉన్న మనదేశంలో వారసులకు ఇవ్వడానికే అక్రమాస్తుల్ని సంపాదిస్తున్నారు. కాబట్టి ఈ జప్తు ఏర్పాటు మంచి ఫలితాలనిస్తుంది.

- ప్రభుత్వ కార్యాలయాలలో లంచాలు లేకుండా 'పౌర సేవల' (సర్వీస్ గ్యారంటీ) చట్టం తీసుకురావాలి. దీనివల్ల ప్రజలకు రోజువారీ అవినీతి తగ్గుతుంది, రాజకీయ అవినీతికి కొంత కళ్లెం పడుతుంది.
- హక్కుగా అందాల్సిన సేవలకు గతిలేక లంచం ఇస్తున్న ప్రజలపై కేసులు పెట్టాలని, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై విచారణకు అనుమతి తీసుకోవాలని మతిలేనిరీతిలో అవినీతి నిరోధక చట్టానికి ప్రతిపాదించిన సవరణల్ని వెనక్కితీసుకోవాలి
- రాష్ట్రాల్లో లోకాయుక్తని పటిష్టం చేయాలి
- దర్యాప్తు సంస్థలైన ఏసీబీలు, సీబీఐకి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించి లోకాయుక్త, లోక్‌పాల్ పరిధిలోకి తేవాలి
- అధికారాన్ని వికేంద్రీకరించి స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని బదిలీ చేయాలి. స్థానికంగా అవినీతి జరిగితే చర్యలకు జిల్లా స్థాయిలో 'అంబుడ్స్‌మన్'ను ఏర్పాటు చేయాలి.
- నల్లడబ్బుకి మూలంగా ఉన్న రాజకీయ అవినీతికి కళ్లెం వేసేలా దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వంటి సంస్కరణల్ని ఎన్నికల వ్యవస్థలో తీసుకురావాలి.

వీటితోపాటు బినామీ ఆస్తుల జప్తు చట్టాన్ని అమలు చేస్తే ఫలితం ఉంటుందిగానీ.. వీటన్నిటినీ పక్కనపెట్టి బినామీల నిషేధ చట్టాన్ని ఓ భారీ మార్పు తెచ్చే కార్యక్రమంలా అమలు చేయటం వల్ల నోట్ల రద్దులోలా అమాయకులు, సామాన్యులు ఇరుక్కుంటారు తప్ప, పెద్ద దొంగలు దొరికి ఆశించిన ఫలితాలు వస్తాయా అన్నది సందేహాస్పదమే.




# బినామీ లావాదేవీల (నిషేధ) చట్టం

దేశంలో బినామీ లావాదేవీల వ్యవస్థను రూపు మాపటానికి 1970ల నుంచే ప్రయత్నాలు మొదలయ్యాయి. 1973లో లా కమిషన్ ఆధ్వర్యంలో పలు అధ్యయనాలు జరిగాయి. చివరకు కేంద్ర ప్రభుత్వం 'బినామీ లావాదేవీల (నిషేధ) చట్టం - 1988' తీసుకొచ్చింది. ఇది 1988, మే 19 నుంచి అమల్లోకి వచ్చింది. ఇందులో పలు లోపాలు ఉండటంతో అమలుకు నిబంధనల రూపకల్పన జరగలేదు. నల్లధనం అరికట్టడానికి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా మోదీ ప్రభుత్వం పెద్ద నోట్ల రద్దు కంటే ముందుగానే ఈ చట్టానికి నిబంధనల్ని తీసుకొచ్చింది. కొత్త సవరణల చట్టం నవంబర్, 2016 నుంచి అమల్లోకి వచ్చింది. నోట్ల రద్దు అమలు తర్వాత బడాబాబులు తమ సొమ్మును బినామీల పేరు మీద పెట్టకుండా ఈ చట్టాన్ని అమలు చేస్తున్నారు. అనుమానాస్పదంగా ఉన్న కొంతమంది మీద దాడులు ఇప్పటికే దాడులు ప్రారంభించారు.

**బినామీ లావాదేవీలంటే..**

- ఒక ఆస్తిని తన సొమ్ముతో కొని దానిని మరొకరి పేర రాయించి ఉంచుకోవటం
- అసలు ఉనికిలోనే లేని వ్యక్తి.. అంటే కల్పిత పేరుతో ఆస్తికి సంబంధించిగానీ, లేదా మరేదైనా లావాదేవీగానీ జరపటం
- ఇతరుల ఖాతాల్లో భారీగా నగదును దాచటం

**గుర్తించిన ఆస్తుల జప్తు**

బినామీ లావాదేవీలతో సంబంధం ఉన్న ఏ ఆస్తినైనా జప్తు చేసే అధికారం కేంద్రానికి ఉంటుంది. దర్యాప్తు అధికారి ఓ ఆస్తికి సంబంధించిన బినామీదారుగా చెప్పడానికి ఆధారాలు సేకరించాక.. బినామీదారుకు తాఖీదులు జారీ చేయవచ్చు. అసలు వ్యక్తిని గుర్తించినట్టయితే వారికీ పంపవచ్చు. ఒకవేళ నోటీసు ఇచ్చాక ఆస్తిని అన్యాక్రాంతం చేస్తారని అనుమానించినట్టయితే పైఅధికారుల అనుమతితో ఆస్తులను తాత్కాలిక జప్తు చేసే అధికారం దర్యాప్తు అధికారికి ఉంటుంది. దీంతో బినామీదారు ఆ ఆస్తిని తన సొంతమని నిరూపించుకోవాల్సి ఉంటుంది. న్యాయాధికార సంస్థ ఇచ్చిన ఉత్తర్వులను అప్పిలేట్ ట్రైబ్యునల్‌లో సవాలు చేయవచ్చు. ఆ ఉత్తర్వులపై అభ్యంతరాలుంటే హైకోర్టును ఆశ్రయించవచ్చు. ఈ చట్టం కింద నమోదయ్యే కేసుల విచారణకు కేంద్రం ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయవచ్చు.

■ ఎవరి పేరిటైనా ఆస్తిని రాసిపెట్టినప్పుడు వారు దానిపై యాజమాన్య హక్కును తిరస్కరించినా, అసలు తమకా విషయం తెలీదని చెప్పినా ఆ లావాదేవీ బినామీయే అవుతుంది

■ బినామీదారుగా ఉన్న ఏ వ్యక్తీ యజమాని ప్రయోజనాల నిమిత్తం ఆ ఆస్తిని బదలాయించరాదు. నిబంధనలకు విరుద్ధంగా జరిపిన లావాదేవీ చెల్లుబాటు కాదు.

**కొన్ని మినహాయింపులు**

■ కుటుంబ సభ్యుల విషయంలో ఈ చట్టం కొన్ని మినహాయింపులను ఇచ్చింది. అవిభక్త హిందూ కుటుంబంలో కుటుంబ పెద్ద తన సొమ్మును వెచ్చించి కుటుంబసభ్యుల పేరుతో ఆస్తిని కొనుగోలు చేయవచ్చు.

ఎ) సోదరుడు, సోదరి పేరుతో కొనుగోలు చేయవచ్చు

బి) ట్రస్టీ, కంపెనీ తరపున డైరెక్టర్, భాగస్వామి కొనుగోలు చేయవచ్చు

**న్యాయ నిర్ణయాధికార సంస్థ**

మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద ఏర్పాటైనట్టే ఈ చట్టం కింద కూడా ఓ న్యాయ నిర్ణయాధికార సంస్థ (అడ్జ్యుడికేటింగ్ అథారిటీ) ఏర్పాటవుతుంది. ఇందులో పనిచేసే అధికారులు ఛైర్మన్ ఆదేశాల మేరకు విధులు నిర్వహించాలి. ఐఆర్ఎస్ స్థాయి, ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ స్థాయి అధికారి ఛైర్మన్‌గా ఉంటారు. అథారిటీ ఢిల్లీలో ఉండగా ఇతర ప్రాంతాల్లో బెంచ్‌లను ఛైర్మన్ సలహాతో కేంద్రం నోటిఫికేషన్ ద్వారా ఎక్కడైనా ఏర్పాటు చేయవచ్చు. ఈ చట్టం కింద వచ్చే కేసుల విచారణ సందర్భంగా సివిల్ ప్రొసీజర్ కోడ్‌ను అనుసరించాల్సిన అవసరం లేదు. అయితే చట్టపరిధిలో సహజ న్యాయసూత్రాలకు అనుగుణంగా వ్యవహరించాలి.

**అన్ని శాఖలూ సహకరించాల్సిందే**

■ ఈ చట్టం అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకింగ్ కంపెనీలు సహకరించాల్సి ఉంది

■ అనుమతి పొందిన అధికారి ఏ వ్యక్తికి చెందిన ఆస్తులైనా, ఖాతాలైనా, పత్రాలైనా.. ఇలా దేనిపైనైనా దర్యాప్తు చేపట్టవచ్చు

■ ఈ సంస్థ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేయటానికి వీలుగా అప్పీలేట్ ట్రైబ్యునల్ ఉంటుంది. ఇందులో ఛైర్మన్‌గా ప్రస్తుతం పదవిలో ఉన్న లేదా పదవీవిరమణ చేసిన హైకోర్టు న్యాయమూర్తి వ్యవహరిస్తారు.

**తనిఖీలకు అధికారం**

■ ఈ చట్టం కింద ఉన్న అధికారులకు సివిల్ ప్రొసీజర్ కోడ్ కింద సివిల్ కోర్టుకు ఉన్న అధికారాలు ఉంటాయి

■ ఎక్కడైనా తనిఖీ చేసే అధికారం ఉంది

■ బ్యాంకింగ్ కంపెనీ, ఇతర ప్రభుత్వ ఆర్థిక సంస్థ, మరే సంస్థకు చెందిన అధికారినైనా వ్యక్తిగతంగా హాజరుకు ఆదేశించవచ్చు. సమన్లు జారీ చేయవచ్చు.

■ ఖాతా పుస్తకాలు, ఇతర పత్రాలను సమర్పించాలని ఆదేశించవచ్చు

## దొరికిపోతే ఏడేళ్లు జైలు

■ బినామీగా ఉన్నా, బినామీగా ఉండటాన్ని ప్రోత్సహించినా ఈ చట్టం కింద నేరమే

■ బినామీ లావాదేవీగా రుజువైతే కనీసం ఏడాది నుంచి ఏడేళ్ల వరకు కఠిన జైలు శిక్ష విధించవచ్చు

■ పాతచట్టంలో గరిష్ఠంగా మూడేళ్ల కారాగార శిక్ష ఉండగా, సవరణ చట్టంలో ఏడేళ్లకు పెంచారు

■ ఆస్తి మార్కెట్ విలువలో 25శాతం జరిమానాగా విధించవచ్చు

■ ఎవరైనా వ్యక్తిగాని, అధికారిగాని తప్పుడు సమాచారమిస్తే.. 6 నెలల నుంచి 5 ఏళ్ల వరకు కఠిన కారాగార శిక్ష విధించవచ్చు. ఆస్తి మార్కెట్ విలువలో 10శాతం జరిమానా వేయవచ్చు

**నల్లధనం అరికట్టడానికి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా మోదీ ప్రభుత్వం పెద్ద నోట్ల రద్దు కంటే ముందుగానే ఈ చట్టానికి నిబంధనల్ని తీసుకొచ్చింది. కొత్త సవరణల చట్టం నవంబర్, 2016 నుంచి అమల్లోకి వచ్చింది. నోట్ల రద్దు అమలు తర్వాత బడాబాబులు తమ సొమ్మును బినామీల పేరు మీద పెట్టకుండా ఈ చట్టాన్ని అమలు చేస్తున్నారు. అనుమానాస్పదంగా ఉన్న కొంతమంది మీద దాడులు ఇప్పటికే దాడులు ప్రారంభించారు.**

# నగదు రహితం ఇలాగా?

- కూసంపూడి శ్రీనివాస్,
లోక్‌సత్తా పార్టీ ఏపీ అధికార ప్రతినిధి

కరెన్సీ రూపంలో భారీగా డబ్బు చెలామణీలో ఉండటం దేశంలో అవినీతి, నల్లధనానికి ఊతమిస్తుందని, దానికి అడ్డుకట్ట వేసేందుకు నగదు రహిత కార్యకలాపాల దిశగా సాగుతున్న మార్పునకు ప్రజలంతా సహకరించాలని పెద్ద నోట్ల రద్దు తర్వాత లింక్డిన్.కామ్ వెబ్‌సైట్‌లో రాసిన వ్యాసంలో ప్రధాని మోదీ పేర్కొన్నారు. అవినీతి, ఉగ్రవాదం, నల్లధనంపై జరుగుతున్న ఈ యజ్ఞంలో హృదయపూర్వకంగా భాగస్వాములవుతున్న ప్రజలకు నా వందనాలు అంటూ ట్వీట్ కూడా చేశారు. అంతేకాకుండా నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు కేంద్రం నజరానాలు కూడా ప్రకటించింది. అంతేకాకుండా దేశవ్యాప్తంగా అక్షరాస్యతలో 30వ స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారి నాయకత్వంలో ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ఇంతవరకు వినడానికి బాగానే ఉంది. మారుతున్న కాలంతోపాటు టెక్నాలజీని కూడా అందిపుచ్చుకోవాలి, కాదనలేం.. కానీ 6 లక్షలకుపైగా గ్రామాలు, అందులోనూ కనీసం విద్యుత్తు కూడా లేని 18,452 గ్రామాలు, 60 శాతం ప్రజల్లో నిరక్షరాస్యత, 28శాతం 65 ఏళ్లు దాటినవారు, 70శాతానికి పైగా స్మార్ట్ ఫోన్ వినియోగం తెలియనివారు, అత్యధికులు గ్రామీణ వ్యవసాయదారులు, 92శాతం నగదు లావాదేవీలపై ఆధారపడినవారు, కేవలం కొంతశాతమే డెబిట్, క్రెడిట్ కార్డులు, ఎలక్ట్రానిక్ బదిలీ ప్రక్రియను ఉపయోగిస్తున్న వారు.. ఉన్న ఈ దేశంలో ఉన్నట్టుండి నగదు రహిత వ్యవస్థ ఎలా సాధ్యమనేది పెద్ద ప్రశ్న.

వ్యవసాయాధారితమైన మనదేశంలో 80శాతం మంది ప్రజలు అసంఘటిత రంగంలోనే ఉన్నారు. నూరు శాతం ఇంటర్నెట్ అందుబాటులో ఉన్న దేశాల్లో కూడా నూరు శాతం నగదు రహిత లావాదేవీలు సాధ్యం కానప్పుడు కనీసం 25శాతం మందికి కూడా సరైన నెట్ కనెక్షన్ అందుబాటులో లేని మనదేశంలో పూర్తిగా నగదు రహితం ఎలా సాధ్యమో పాలకులకే తెలియాలి. అమెరికాలాంటి అభివృద్ధి చెందిన దేశంలో 80శాతం, సింగపూర్‌లో 61శాతం, జపాన్‌లో 14శాతం, చైనాలో 10శాతం మాత్రమే నగదు రహిత లావాదేవీలు జరుగుతున్నాయి. ఈ దేశాల్లో బ్యాంకింగ్ వేగంగా విస్తరిస్తున్నా నగదు వినియోగం మాత్రం పూర్తిస్థాయిలో తగ్గలేదు. అందులోనూ మనదేశంలో ఇంగ్లిష్‌లో చదవడం, రాయడం ఇంకా ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయులకే సరిగా రాదు. ప్రపంచంతో అనుసంధానమై ఉండే ఆన్‌లైన్ వ్యవహారాలను సంభాళించుకోవటం సామాన్య ప్రజలకు ఆగమేఘాల మీద సాధ్యమా అనేది పెద్ద ప్రశ్నార్థకం. బ్యాంకుల్లో ఆధునిక సాంకేతిక సామర్థ్యం కూడా ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. పైగా మనదేశంలో సైబర్ దాడులపై ప్రజలకు అవగాహన కూడా తక్కువే. లక్షలాది కార్మికులు పనుల కోసం తరచూ ఇతర ప్రాంతాలకు వలస వెళుతూండటం, ప్రతి చోటా వారికి బ్యాంకు ఖాతాలు లేదా బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేకపోవడం కూడా పెద్ద సమస్యే.


నిజానికి నల్లకుబేరులపై సర్జికల్ దాడిగా ప్రధాని మోదీ నవంబర్ 8, 2016న తీసుకున్న పెద్ద నోట్ల రద్దు నిర్ణయం సమాజంలో ప్రకంపనలు సృష్టించింది. అన్ని రంగాల్నీ ఈ నిర్ణయం తీవ్రంగా ప్రభావితం చేసింది. నిర్ణయం తీసుకుని నెల రోజులు దాటినా బ్యాంకుల్లోను, ఏటీఎంల్లోనూ సరిపడా నగదు అందుబాటులో ఉంచడంలో విఫలం కావడం, నగదు మారకం ఒక్కసారిగా నిలిచిపోవడంతో ప్రజల్లో అసహనం పెల్లుబుకింది. చిల్లర వర్తకుల నుంచి రోజువారీ కూలీల వరకూ చాలామంది ఉపాధి కోల్పోయారు. ప్రజలంతా త్యాగాలకు సిద్ధపడాలని ప్రభుత్వ అనుకూల వర్గాలు పిలుపునిచ్చాయి. ప్రాణం పోయినా వెనకంజ వేసే ప్రసక్తి లేదంటూ మోదీ తేల్చి చెప్పేశారు. ఈ పరిస్థితుల్లో మోదీ ప్రాణానికి ముప్పు సంగతి ఎలా ఉన్నా పలువురు సామాన్య ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. నిర్ణయం తరువాత ఉత్పన్నమయ్యే పరిస్థితులను అంచనా వేయటంలో విఫలమయిన ప్రభుత్వం రోజుకొక ప్రకటన చేస్తూనే ఉంది. అందుకే సమస్యని పక్కదోవ పట్టించడానికే అన్నట్టు ఇప్పుడు నగదు రహిత ఆర్థిక కలాపాల వ్యవస్థ గూర్చి మితిమీరిన ప్రచారం లేవదీశారనే విమర్శలు వస్తున్నాయి.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏదైనా మార్పు చేసేటప్పుడు దానికి తగ్గ వేరే ఇతర మార్గాలను కూడా ప్రజలకు అందుబాటులో ఉంచాలి. అయితే ఇక్కడ మోదీ ప్రభుత్వం ప్రజలకు వేరే అవకాశం లేకుండా చేసింది. ఒక్కటి మాత్రం నిజం – మోదీ తీసుకున్న ఈ సాహసోపేత నిర్ణయం సంస్కరణలకు ఆరంభమే తప్ప అంతం కాదు. ఇదే గొప్ప సంస్కరణ అన్నట్టు పాలకులు భావిస్తే, వారి సంగతి ఏమవుతుందో గానీ దేశానికి మాత్రం

తీవ్ర నష్టం జరుగుతుంది. నగదు రహిత సమాజం ఆహ్వానించదగ్గదే అయినా, ఒకేసారి అమలులో సాధ్యాసాధ్యాలను కూడా పరిశీలించాలి. అటువంటి సమాజం ఏర్పడటానికి చేపట్టాల్సిన సంస్కరణలను ముందు అమలుచేయాలి. ఇప్పటికైనా ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలి.

పెద్ద నోట్ల రద్దు నేపథ్యంలో పన్నుల ఆదాయం పెరుగుతోంది కాబట్టి ప్రజలపై పన్నుల భారాన్ని తగ్గించడం, పౌర సేవల చట్టం, వార్డు స్థాయి వరకూ తలసరి కేటాయింపు వంటి చర్యలతో పన్నులకు తగ్గ సేవలను అందించడం, నల్లధనానికి కేరాఫ్ అడ్రస్ లాంటి రియల్ ఎస్టేట్ రంగంలో స్టాంప్ డ్యూటీ తగ్గించడం, భూముల విలువను మార్కెట్ రేటుకు తగ్గట్టుగా పెంచడం వంటి మార్పులు చేయాలి. అవినీతి నిరోధక వ్యవస్థల్ని బలోపేతం చేయాలి. నల్లధనానికి పునాదిగా ఉన్న ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు దామాషా పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, స్థానిక ప్రభుత్వాల సాధికారత వంటి చర్యల్ని తీసుకురావాలి. నోట్ల రద్దును సర్వరోగ నివారిణిగా ప్రచారం చేసుకోవడం మాని, నల్లధనం నిర్మూలనకు ఈ సంస్కరణల్ని స్పష్టతతో చేపట్టాలి. పెద్ద నోట్లు రద్దు చేయడానికి కొనసాగింపుగా వేగంగా ఈ వ్యవస్థీకృత మార్పుల్ని తీసుకురాకపోతే ముమ్మందు భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. ❁

# పొంచివున్న మొబైల్ మోసాలు



నగదు రహిత లావాదేవీల దిశగా ప్రజలను మళ్లించటానికి మొదలెట్టిన డీమానిటైజేషన్ ముతక ఆపరేషన్‌ను ఏదోకరూపంలో విజయవంతం అయినట్టు చూపాలని ప్రభుత్వం భావిస్తుంటే, ఆన్‌లైన్ లావాదేవీల ప్రమాదాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మొబైల్ ఫోన్లను బ్యాంకులుగా మార్చుకోవటం పెరుగుతుండటంతో సైబర్ నేరాలూ విజృంభిస్తాయంటున్నారు.

సైబర్ నేరాల్లో క్రెడిట్, డెబిట్ కార్డుల నేరాలదే అగ్రస్థానమని, మూడేళ్లలో వీటి సంఖ్య ఆరు రెట్లు పెరిగిందని అసోచామ్ వెల్లడించింది. పెద్దనోట్ల రద్దుతో డిజిటల్ చెల్లింపులు, ఈ-వాలెట్లు, ఇతర ఆన్‌లైన్ చెల్లింపు గేట్‌వేలు భారీగా పెరిగిన నేపథ్యంలో, అంతేస్థాయిలో మొబైల్ ఫ్రాడ్‌లు పెరుగుతాయని అంచనా వేసింది. వచ్చే ఏడాది మొబైల్ ఫోన్లపై మోసాలు 65శాతం దాకా పెరిగే అవకాశముందని తెలిపింది. ఈ అంశాలపై 'ఈవై' అనే సంస్థతో కలిసి అసోచామ్ అధ్యయనం చేసింది. సైబర్ నేరాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉన్నట్టు వెల్లడించింది. భవిష్యత్తు ఆర్థిక లావాదేవీల్లో 45శాతం మొబైల్ ఫోన్లపైనే జరుగుతాయని తెలిపింది. సైబర్ నేరాల ఫిర్యాదులో 46శాతం క్రెడిట్, డెబిట్ కార్డులు, 39శాతం ఫేస్‌బుక్ దుర్వినియోగానికి సంబంధించి వున్నాయి. ఫోన్లలో మోసం చేయడం (21శాతం), ఈమెయిల్ హ్యాకింగ్ (18శాతం), అసభ్య కాల్స్, ఎస్ఎంఎస్‌లు (12శాతం) వంటి నేరాలు కూడా ఉన్నాయి.

అంతేకాదు.. క్రెడిట్ కార్డులను హ్యాక్ చేయడానికి గంటల సమయం అక్కర్లేదని, సెకన్లలో హ్యాక్ చేసి ఆ ఖాతాలోని డబ్బులను ఇతర ఖాతాలకు మళ్లించేయొచ్చని సైబర్ నిపుణులు చెబుతున్నారు. మీరు కార్డును అత్యంత భద్రంగా దాచుకున్నా, ఆన్‌లైన్‌లో మీరు జరిపే లావాదేవీలను ఆధారం చేసుకుని కార్డును హ్యాక్ చేయవచ్చని అంటున్నారు. ఆన్‌లైన్‌లో ఆరు సెకన్లలో మీ కార్డు నెంబరు, సీవీవీ, పిన్, గడువు పూర్తి తేదీ వివరాలను ఊహించవచ్చని వివరిస్తున్నారు. బ్రిటన్‌లోని న్యూకాసల్ విశ్వవిద్యాలయ పరిశోధకులు వీసా పేమెంట్ వ్యవస్థల పనితీరు, వాటిలో భద్రతపై పరిశోధన చేశారు. ఇప్పుడున్న వ్యవస్థలో నేరగాళ్లు చాలా త్వరగా కార్డు వివరాలను చోరీ చేసే అవకాశముందని తెలిపారు. ఇటీవల టెస్కో సైబర్ దాడులు కూడా ఇలాగే జరిగి ఉండవచ్చని వివరించారు. కార్డు లావాదేవీల వ్యవస్థల్లో ప్రస్తుతం రెండు లోపాలు ఉన్నాయని, వీటిని దేనికి దాన్ని ప్రత్యేకంగా చూస్తే చాలా చిన్నవిగా కనిపిస్తాయని.. రెండింటినీ ఆధారం చేసుకుని సైబర్ దాడికి ప్రయత్నిస్తే సులభంగా హ్యాక్ చేయవచ్చని తెలిపారు. చాలా వెబ్‌సైట్ల నుంచి ఇన్‌వాలీడ్ పేమెంట్ రిక్వెస్టులు వస్తే ప్రస్తుతం ఉన్న నెట్‌వర్క్ భద్రతా వ్యవస్థలు గుర్తించలేవని, ఈ రిక్వెస్టుల ద్వారా కార్డుల సమాచారాన్ని సులభంగా గుర్తించవచ్చని చెప్పారు. వేర్వేరు వెబ్‌సైట్లు కార్డుతో లావాదేవీలు జరిపేటప్పుడు వేర్వేరు వివరాలు అడుగుతుంటాయని, దీంతో కార్డు వివరాలు తెలుసుకోవడం చాలా సులభమని వివరించారు. ❁

# దేశ ఆరోగ్య సంక్షోభాన్నీ బైటపెట్టిన డీమానిటైజేషన్



పెద్ద నోట్ల రద్దు నేపథ్యంలో బ్యాంకులు, ఏటీఎంల ముందు క్యూలలో నిలబడి చనిపోయినవారిలో చాలామంది అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారే. అలా అకాల మరణం బారిన పడకపోయినా.. కేవలం నగదు కోసం క్యూలో నిలబడినందుకు వచ్చిన అనారోగ్యానికి మందులు వాడినవారు, బి-కాంప్లెక్స్ బిళ్లలు మింగి క్యూలో నిలబడటానికి సమాయత్తమైనవారి సంఖ్యయితే భారీగానే ఉంది.



నల్లధనంపై యుద్ధం, డిజిటల్ లావాదేవీలు వంటి వాటి హడావుడిలో చాలామంది ప్రజానీకం ఈ విషయాల్ని గుర్తించి ఉండకపోవచ్చు. పాలకులు గుర్తించినా తెలియనట్టే నటిస్తుండొచ్చు.. కానీ మనదేశ ఆరోగ్యవ్యవస్థ ఎంత అధ్వాన్నంగా ఉందో డీమానిటైజేషన్ క్రూరంగా బైటపెట్టింది. సరైన ఆరోగ్యం, చదువు లేని దేశం ఆర్థికంగా ఎంత సుస్థిరాభివృద్ధి చెందగలుగుతుంది? డీమానిటైజేషన్ వంటి కార్యక్రమాల ద్వారా ఒకవేళ లబ్ధి కలిగితే ఎంతమేర సద్వినియోగం చేసుకోగలరు? అన్న ఆలోచనలే పాలకులకు కలగటం లేదు. నల్లధనం, అవినీతి వల్ల ప్రజలకు అందాల్సిన విద్య, ఆరోగ్యం, ఉపాధి దెబ్బతింటుందని ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలు చేసిన తీర్మానాల మీద సంతకాలు చేశారుగానీ, నోట్ల రద్దు, నల్లధనంపై చర్చలో మాట వరసకు కూడా మన పాలకులు ఆ మాటలు అనటం లేదు. డీమానిటైజేషన్ వల్ల ఏమైనా ఆర్థికలాభం జరిగితే అందరికీ మంచి విద్య, ఆరోగ్యం అందించటమన్న ఊహే ప్రజలలో రాకుండా చేస్తున్నారు. ప్రాచుర్య ప్రతిపక్షాలు కూడా.. డీమానిటైజేషన్ అమలులో మోదీ ప్రభుత్వ వైఫల్యాన్ని దునుమాడి రాజకీయ లబ్ధి పొందుదామనే ఆరాటపడుతున్నాయి తప్ప ఈ రంగాల గురించి మాట్లాడటం లేదు.

మనదేశంలో అందరికీ ఆరోగ్యం అందకపోవటానికి పాలకుల నిర్లక్ష్యమే కారణమనటంలో సందేహం లేదు. మన రాజకీయ వ్యవస్థ, సమాజం.. విద్య, ఆరోగ్యాలను ఎన్నికల అంశాలుగా మార్చటంలో స్వాతంత్ర్యం వచ్చిననాటి నుంచి విఫలమైనాయి. మతానికి మూలకారణాల్లో అనారోగ్యానికి చికిత్స కూడా ఒక ప్రధాన కారణమైనా.. రాజకీయుల నుంచి పూజలందుకునే మతాచార్యులు, ఆధ్యాత్మికవేత్తలు కూడా అందరికీ ఆరోగ్యం కోసం, అందరికీ ఆరోగ్యం పేరుతో జరుగుతున్న డ్రామా స్కీములపైనా బలంగా గళం విప్పటం లేదు. తాయిలాల మీద కాకుండా మానవవనరుల అభివృద్ధిపై ప్రజల్లో ఆశలు రేకెత్తించి వచ్చిన మోదీ ప్రభుత్వం కూడా ఈ రంగాల్లో పెద్దగా చొరవ తీసుకోవటం లేదు. ఇప్పుడు కేటాయిస్తున్న నిధుల కంటే పెద్ద ఎక్కువ నిధుల కేటాయింపు అక్కర్లేకుండానే, జాతీయాదాయంలో కేవలం 2-3శాతంతోనే, జనం జేబులో నుంచి రూపాయి ఖర్చు లేకుండా అందరికీ

ఆరోగ్యం అందించే పథకాన్ని లోక్‌సత్తా కేంద్రానికి అందించినా.. ఇప్పటికీ మోదీ సర్కారు మీనమేషాలు లెక్కపెడుతోంది. మోదీకి, సాంప్రదాయ రాజకీయపార్టీలకి, సమాజంలోని కొంతమందికి ఇష్టమున్నా లేకపోయినా.. ఆరోగ్యం సహా పలు కీలకరంగాల్లో డీమానిటైజేషన్ 'సంస్కరించు లేదా సమసిపో' దిశగానే దేశాన్ని ప్రభావితం చేసే అవకాశముంది.

ఆరోగ్యరంగంలో వరస ప్రభుత్వాల వైఫల్యాన్ని ఇటీవల హైదరాబాద్ ఆస్కి (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా) వ్యవస్థాపక దినోత్సవంలో కూడా వక్తలు మరోమారు దేశం దృష్టికి తీసుకొచ్చారు. ప్రజారోగ్య సాధనకు రాజకీయ చిత్తశుద్ధి కావాలని స్పష్టం చేశారు.






"మనదేశంలో ప్రజారోగ్యంపై చేస్తున్న ఖర్చు స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో ఒక్కశాతం మాత్రమే. అదే కెనడా తన జాతీయాదాయంలో 7శాతం వెచ్చిస్తోంది" అని భారత వైద్యపరిశోధనామండలి డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్యా స్వామినాథన్ అన్నారు. వైద్యపరిశోధనకు ఎక్కువ నిధులు కేటాయించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 'దేశంలోని పేదలకు అందుబాటులో ఆరోగ్య భద్రత' అంశంపై ఆమె మాట్లాడారు.

కొన్ని దశాబ్దాల క్రితం అంటువ్యాధులతో ఎక్కువమంది చనిపోయేవారని, ఇప్పుడు మాత్రం జీవనశైలి (దీర్ఘకాలిక) రోగాల కారణంగా అధికంగా మరణిస్తున్నారని సౌమ్యా స్వామినాథన్ వివరించారు. "ప్రాథమిక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే జీవితకాలాన్ని పెంచవచ్చు. అయితే ఇందుకు ముందుగా ఆరోగ్య ఉపకేంద్రాలను బలోపేతం చేయాలి. ఆరోగ్య, స్వస్థత కేంద్రాలను నెలకొల్పాలి. కాలుష్యాన్ని నిరోధించాలి. మరణాలకవివరాలు స్పష్టంగా ఉండటం లేదు. ఆరోగ్య సమాచారాన్ని సమగ్రంగా నమోదు చేస్తుంటే అకాల మరణాల్ని నివారించే అవకాశాలు మెరుగవుతాయి" అన్నారు.

దేశంలో ఏటా 10లక్షల మంది కేవలం వైద్యచికిత్సలకయ్యే ఖర్చు వల్ల పేదరికంలో కూరుకుపోతున్నారన్నారు. అందరికీ ఆరోగ్య కవరేజీ కల్పించే దిశగా ఓ సమగ్ర ప్యాకేజీ కావాలని ఆమె అన్నారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం, దేశంలో 80శాతం మంది డాక్టర్లు, 70శాతం డిస్పెన్సరీలు పట్టణాల్లో ఉన్నాయని కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి పద్మనాభయ్య అన్నారు. ఆరోగ్యరంగం 80శాతం ప్రైవేటు చేతుల్లోనే ఉందన్నారు. "వ్యక్తుల జీవితకాలం కేరళలో 72 ఏళ్లు ఉంటే, మధ్యప్రదేశ్‌లో 56ఏళ్లే. ఒకే దేశంలో ఇంతటి వ్యత్యాసం ఉండటం నిజంగా బాధాకరం" అన్నారు.

# 2017లోనైనా హక్కుగా 'పౌర సేవల' చట్టాన్ని కేంద్రం అమలుచేయాలి: సీనియర్ ఐఏఎస్‌లు



ప్రజల చుట్టూ పాలన ఉండాలనే కల నెరవేరటానికి హక్కుగా 'పౌర సేవల' (సర్వీస్ గ్యారంటీ) చట్టాన్ని అమలు చేయటం కీలకమని కేంద్రంలో, కేరళ, తెలంగాణ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారులు అన్నారు. పెండింగ్‌లో ఉన్న పౌర సేవల చట్టాన్ని 2017లోనైనా కేంద్రం అమలుచేయాలన్నారు.

డిజిటల్ సమాజంపై వీరి ఇంటర్వ్యూల సంకలనాన్ని ఓ ఆంగ్లపత్రిక ప్రచురించింది.

ఐ.టి రంగంలో భారత్ వేగంగా పురోగమిస్తోందని, దీనివల్ల పారదర్శకత పెరుగుతూ, కొంతమేర అవినీతి తగ్గుతోందని, కానీ పౌర సేవల హక్కు చట్టం ఉంటేనే పాలనకు ప్రజలు కేంద్రబిందువు కాగలుగుతారని, వారికి సాధికారత ఐఏఎస్‌లు అన్నారు. ఇందుకు సమాచారాన్ని నిరంతరం అప్‌గ్రేడ్ చేయటం, అన్ని విభాగాలనూ అనుసంధానం చేయటం అవసరమన్నారు. అనివార్యమైన డిజిటలైజేషన్‌ను ఇందుకు అవకాశంగా ఉపయోగించుకుని, ప్రభుత్వ కార్యాలయాల్లో పౌరసేవా పత్రాల (సిటిజన్ ఛార్టర్లు)తో ప్రతి పనికీ నిర్ణీత గడువు పెట్టి, ఆ గడువులోగా పూర్తికాకపోతే దరఖాస్తు చేసుకున్న వారికి రోజుకు కొంత డబ్బు పరిహారం చెల్లించే ఏర్పాటు చేస్తే.. అవినీతి చాలా తగ్గుతుందన్నారు.

ప్రస్తుతం ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో అడుగున ఉన్న భారత్ తన వాణిజ్యావకాశాల్ని కూడా మెరుగుపరుచుకోవటానికి, మేకిన్ ఇండియా విజయవంతం కావటానికి కూడా సర్వీస్ గ్యారంటీ చట్టం దోహదం చేస్తుందన్నారు.

ఎలక్ట్రానిక్ సేవలు సహా ప్రభుత్వం అందించే ధ్రువపత్రాల జారీ సహా అన్ని సేవలకూ నిర్ణీత గడువు, ఆలోగా చేయకపోతే రోజుకు కనీసం రూ.250 పరిహారం వంటి ఏర్పాట్లతో లోక్‌సత్తా రూపొందించిన పౌర సేవల బిల్లు పార్లమెంటు ముందు పెండింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. జాతీయస్థాయిలో చేసే లోగా రాష్ట్రంలో చేయాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుకి కూడా లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ ఈ బిల్లును కొన్ని మార్పులు చేసి పంపించారు.

దేశంలోనే తొలిసారిగా 1998లో సిటిజన్ ఛార్టర్లతో లోక్‌సత్తా రూపొందించిన 'స్వరాజ్యం' పుస్తకం, పౌర సేవల గ్యారంటీ బిల్లుల వివరాలను www.fdrindia.org లో చూడొచ్చు.

# డిజిటల్ రోడ్‌మ్యాప్

నోట్ల రద్దు నేపథ్యంలో డిజిటల్ లావాదేవీలను పెంపొందించేందుకు రాయితీ, క్యాష్‌బ్యాక్ వంటి ప్రోత్సాహకాలను అందించాలని.. డిజిటల్ చెల్లింపుల నియంత్రణను రిజర్వుబ్యాంకు కార్యకలాపాల నుంచి స్వతంత్రంగా ఉంచాలని లేదా అందుకోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని రతన్ పి. వతల్ కమిటీ ప్రభుత్వానికి సూచించింది.

ప్రస్తుతం వ్యక్తిగత స్థాయిలో 5శాతంగా, మొత్తమ్మీద 20శాతంగా ఉన్న డిజిటల్ చెల్లింపులను వచ్చే మూడేళ్లలో గణనీయంగా పెంచటానికి తీసుకోవాల్సిన చర్యలపై రోడ్‌మ్యాప్‌ను రూపొందించటానికి కేంద్రం ఈ కమిటీని ఏర్పాటు చేసింది.

**కమిటీ ప్రధాన సిఫార్సులు :**

1) డిజిటల్ చెల్లింపుల నియంత్రణకు సంబంధించి కమిటీ రెండు ప్రతిపాదనలు చేసింది. ఒకటి.. 'పేమెంట్స్ రెగ్యులేటరీ బోర్డు' పేరిట సరికొత్త చెల్లింపుల నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయటం. రెండోది.. ప్రస్తుతం ఆర్‌బీఐ పరిధిలో ఉన్న బోర్డ్ ఫర్ రెగ్యులేషన్ అండ్ సూపర్ విజన్ ఆఫ్ పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ (బీపీఎస్ఎస్)కు మరింత స్వతంత్ర ప్రతిపత్తి కల్పించటం. 2) డేటా భద్రత తదితరాలకు సంబంధించి వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటానికి ప్రస్తుతమున్న 'పేమెంట్స్ అండ్ సెటిల్‌మెంట్స్ సిస్టమ్స్ యాక్ట్'ను అప్‌డేట్ చేయాలి. 3) ప్రభుత్వ చెల్లింపులు, వసూళ్లలో డిజిటల్ విధానాలను అమలుచేయాలి. వివిధ ప్రభుత్వ విభాగాలు, సేవలకు చెల్లింపులను డిజిటల్ విధానంలో చేసినప్పుడు విధిస్తున్న ఛార్జీలన్నిటినీ ఎత్తివేయాలి. కరెంటు బిల్లులు, నీటి బిల్లులు వంటివి ఆన్‌లైన్‌లో కడితే ఛార్జీలు పడుతున్నాయి. ఇలాంటి ఛార్జీలను ప్రభుత్వమే భరించాలి. 4) ప్రభుత్వంలోని అన్ని శాఖలూ, విభాగాలూ డిజిటల్ చెల్లింపులకు అవకాశం కల్పించటాన్ని తప్పనిసరి చేయాలి. ఇంకా వీలైతే.. జరిమానాలతో సహా ప్రభుత్వానికి ఏ చెల్లింపునైనా డిజిటల్ విధానంలో చేస్తే రాయితీ లేదా క్యాష్‌బ్యాక్ విధానాల్లో ప్రోత్సాహకాలు అందించాలి. 5) నగదురహిత లావాదేవీల ద్వారా మిగిలిన పొదుపు మొత్తంతో డిజిటల్ చెల్లింపులను మరింత పెంచేలా 'దీపయాన్' పేరుతో ఒక నిధిని ఏర్పాటు చేయాలి. 6) ఆధార్ ఆధారిత ఈ-కేవైసీ (నో యువర్ కస్టమర్), కాగితరహిత ధ్రువీకరణలను ప్రోత్సహించాలి. 7) నెఫ్ట్, ఆర్టీజీఎస్ వంటి చెల్లింపుల వ్యవస్థలు రోజులో నిర్ణీత సమయం కాకుండా.. 24 గంటలూ పనిచేసేలా చేయాలి. వీలైతే.. ఈ రెండింటి కార్యకలాపాలను అవుట్ సోర్సింగ్‌కు ఇచ్చే ప్రతిపాదనను పరిశీలించాలి. 8) బ్యాంకేతర పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లకు కొన్ని నియంత్రణలతో పేమెంట్ సిస్టమ్స్ యాక్సెస్ ఇవ్వాలి. 9) మొబైల్ నంబర్, ఆధార్ ఆధారిత చెల్లింపులకు ప్రాధాన్యత ఇవ్వాలి. వచ్చే రెండు, మూడు నెలల్లో ఈ చర్యలు తీసుకోవాలి. ఈ ప్రక్రియను ఆర్థికశాఖ, ఆర్‌బీఐ, యూఐడీఏఐ, ట్రాయ్ పర్యవేక్షించాలి.

కమిటీ నివేదికలో పేర్కొన్న కొన్ని ఇతర ప్రోత్సాహకాలకు సంబంధించిన సిఫార్సులను ప్రభుత్వం ఇప్పటికే అమలు చేయటం ప్రారంభించింది.

## నోట్ల రద్దు, ప్రభుత్వ దివాళాకోరు విధానాలతో టమాటా రైతు మళ్లీ కుదేలు



పాలకులకు నిజాయతీ, అవగాహన లేకపోతే ప్రజలకు కలిగే నష్టాలకు టమాటా రైతుల దయనీయ స్థితి మరోసారి అద్దంపడుతోంది. పంటలకు డిమాండ్ వచ్చే వరకూ నిల్వ, ప్రాసెసింగ్ చేసుకునే ఏర్పాట్లు కూడా చేయలేని పాలకుల దివాళాకోరు విధానాలకు పెద్ద నోట్ల రద్దుతోడవటంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలోని టమాటా రైతులు ఈ సీజన్‌లో పూర్తిగా కుదేలయ్యారు. ఉన్న నీటిని పొదుపుగా వాడుకుని ఎకరాకి రూ. 75,000 నుంచి రూ. 1,00,000 వరకు ఖర్చు చేసి ఆపిల్ పండ్లలాంటి టమాటాలను పండించిన ఆదిలాబాద్ జిల్లాలోనే రైతులు కనీసం రూ. 150 కోట్లు నష్టపోయినట్టు అంచనా. కిలో టమాటా రూపాయి, రెండ్రూపాయలకు మించి పలకకపోవటంతో.. రోడ్ల పక్కన పడేశారు. కొంతమంది పంటను పశువులకు వదిలేశారు.

# అరెస్టులు చేసి పబ్లిక్ హియరింగ్!




కాకినాడ పోర్టుకి భూసేకరణ కోసం తూర్పు గోదావరి జిల్లా తొండంగి మండలం కోనపేట వద్ద ఏర్పాటు చేసిన పబ్లిక్ హియరింగ్ పోలీసు జులుం మధ్య నియంతృత్వ పాలనలోలా జరిగింది. ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు వచ్చి అభిప్రాయాలు చెప్పమని ప్రకటన ఇచ్చి.. ఆ తర్వాత లోక్‌సత్తా సహా పలు రాజకీయ పార్టీల నేతల్ని అరెస్టు చేసి తూతూ మంత్రంగా బహిరంగ విచారణ కొనసాగించారు. దాదాపు 550 ఎకరాల భూసేకరణపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో చర్చించి పరిష్కరించకుండా పాలకులు అరెస్టులతో అణచివేసే ప్రయత్నం చేశారు. అసంతృప్త రైతులు, గ్రామస్తులకు రాజకీయ, పౌరసమాజ నేతలు నాయకత్వం వహించకుండా ఈ దాష్టీకానికి పాల్పడ్డారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎదుర్లంక ఎంపీటీసీ రాజ్ వర్మ, సీపీఎం జిల్లా అధ్యక్షుడు డి. సుబ్బారావు, సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు పీఎస్ నారాయణ, బహుజన యునైటెడ్ ఫ్రంట్ నేత సీహెచ్ వేణుగోపాల్, న్యూడెమోక్రసీ జె. వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పంతం నానాజీ, కాకినాడ వామపక్ష నేతలు పి. వీరబాబు, శేష బాబ్జీ, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నేత, ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఇనపురపు సత్యనారాయణ, వైసీపీ నేత రావూరు వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బేబి రాణి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి. తేజ తదితర నేతలు ఉన్నారు. తమను సాయంత్రం వరకు పోర్టు పోలీసు స్టేషన్‌లో బంధించి, హియరింగ్ తంతు పూర్తయ్యాక విడుదల చేశారని, ఇంత అధ్వాన్న పాలనకు గోదావరి జిల్లాల ప్రజాప్రతినిధులైనా సిగ్గుపడాలని రాజ్ వర్మ అన్నారు.

# తెలంగాణలోనూ చట్టం కొందరికే వర్తిస్తుంది..

చట్టం ముందు అందరూ సమానం కాదని ప్రజలు మరోమారు నిట్టూర్చేలా నయీం కేసు నీరుగారిపోయింది. తెలంగాణ వస్తే ఎన్నో మార్పులు వస్తాయని ఆశపడ్డవారికి ఈ కేసు తీవ్ర ఆశాభంగం కలిగించింది. నయీం బతికున్నంత కాలం భయంతో వెనకాడిన బాధితులు మృతి చెందిన తర్వాత ఫిర్యాదు చేయటంతో 175 కేసులు నమోదయ్యాయి. నయీం కేసు విచారణ సందర్భంగా తెరాస సహా పలు పార్టీల నేతల పేర్లు ప్రస్తావనకు వచ్చాయి. విశ్రాంత అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, ఏసీపీలు మద్దిపాటి శ్రీనివాసరావు, సీతారాం, సీఐలు బి. కృష్ణ, పి. శ్రీనివాసనాయుడు, మహ్మద్ మజీద్.. ఇలా పలువురి అధికారుల పేర్లు కూడా రికార్డుల్లోకెక్కాయి. ఈ నేపథ్యంలో నేరరాజకీయాలు, ఎన్నికల్లో నల్లడబ్బు ఖర్చుని ప్రక్షాళన చేసేలా పెద్దఎత్తున చర్యలుంటాయని ఆశపడ్డవారికి షాక్‌నిస్తూ.. రెండునెలలుగా మందగించిన దర్యాప్తును పూర్తిగా నీరుగార్చేలా తెలంగాణ హోంశాఖ హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ప్రజాప్రతినిధులు, అధికారులతో నయీంకు సంబంధాలున్న ఆధారాలేమీ లభించలేదని అందులో తెలిపింది. పోలీసు అధికారులకు కూడా చెప్పకుండా అఫిడవిట్ దాఖలు చేశారంటున్నారు. చూద్దాం, ఈ వైరుధ్యాలు కేసును ఎప్పటికైనా తిరగదోడతాయేమో!


# ఇక నుంచి జవాబుపత్రాలు రూ.100కే

## – లోక్‌సత్తా ఫిర్యాదుతో తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు లాభం –

విద్యార్థులకు జవాబు పత్రాలను రూ.100కే ఇవ్వాలని సమాచార కమిషన్ విశ్వవిద్యాలయాలను ఆదేశించింది. లోక్‌సత్తా ఫిర్యాదుతో కమిషన్ స్పందించి ఈ ఉత్తర్వులను ఇచ్చింది. దీనివల్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన ఎక్కువమంది విద్యార్థులు జవాబు పత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటారని, ఫలితంగా ప్రశ్నాపత్రాల్ని దిద్దే అధ్యాపకులు కూడా శ్రద్ధగా వ్యవహరించాల్సి వస్తుందని పరిశీలకులు భావిస్తున్నారు.

సమాచార హక్కు చట్టం ప్రకారం ఏ సమాచారమైనా ప్రతి పేజీకి రెండు రూపాయలు చెల్లించాలన్నది నిబంధన. కానీ ఇందుకు భిన్నంగా విద్యార్థులు జవాబుపత్రాలు కావాలంటే వెయ్యి రూపాయలు చెల్లించాలని ఉస్మానియా, కాకతీయ, శాతవాహన యూనివర్సిటీలు, రూ.5000 చెల్లించాలని జేఎన్‌టీయూ నాలుగేళ్ల క్రితం ఆదేశాలు జారీ చేశాయి. సమాచార హక్కు చట్టం కింద జవాబుపత్రాలు అడగవద్దని ఉస్మానియా యూనివర్సిటీ 2013లో ఆదేశించింది. విశ్వవిద్యాలయాల వ్యవహారశైలి సహ చట్టం స్ఫూర్తికి విరుద్ధమని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ కరీంనగర్ అధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్ రాష్ట్ర సమాచార కమిషన్‌కు 2015లో ఫిర్యాదు చేశారు. కేసు నెంబర్ 11206/2015లో ఇటీవల జరిగిన విచారణలో యూనివర్సిటీల్లో జవాబు పత్రాలకు రూ.100 కంటే ఎక్కువ వసూలు చేయటానికి వీల్లేదని, తదనుగుణంగా ఉత్తర్వులు జారీ చేయాలని సహ కమిషనర్ తాంతియా కుమారి ఆదేశించారు. ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్, ఉపకులపతి ప్రతినిధులు హాజరైన కేసు విచారణలో.. అన్ని విశ్వవిద్యాలయాలకూ వర్తించేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ తీర్పుతో నాలుగు సంవత్సరాలుగా వర్సిటీల దోపిడీకి గురవుతున్న విద్యార్థులకు ఊరట కలుగుతుందని లోక్‌సత్తా 2.0 ఉద్యమ నేతలు శ్రీనివాస్, ప్రకాష్ హోల్లా అన్నారు.

# వేగం, పట్టుదల లేని దేశం మనది!



దేశంలో ఏదోక మార్పు ఎప్పుడోకప్పుడు వస్తుంది. కానీ ఆశించిన మార్పు సకాలంలో రాకపోతే కోట్లాదిమంది తీవ్రంగా నష్టపోతారు. నివారించదగ్గ బాధలే మనదేశ రాజకీయం, సమాజం చేస్తున్న పెద్ద పాపం! సరైన ఆచరణాత్మక మార్పుల్ని వేగంగా తీసుకొచ్చి నివారించదగ్గ బాధల్ని తొలగించటం కోసమే లోక్‌సత్తా ప్రయత్నమంతా" అని వ్యవస్థాపకుడు డా॥ జేపీ తరచూ చెప్పే మాటలనే ఇటీవల తిరుపతిలో జరిగిన జాతీయ సైన్స్ కాంగ్రెస్ 104వ సదస్సు కూడా ఉద్ఘాటించింది. దేశానికి స్వతంత్రం వచ్చి 70 సంవత్సరాలైనా ఆవిష్కరణల్లో వెనకబడటానికి కారణం ఎవరు? విద్యాలయాలా.. వాటిలోని ప్రతిభను వాడుకోని పరిశ్రమలా? అని ఇందులో తర్కించారు. చివరికి.. విద్యాలయాలు, లైసెన్స్ – పర్మిట్‌లతో అవినీతిమయమైన రాజ్యవ్యవస్థ రెంటిలోనూ తప్పుందని తేలింది. విశ్వవిద్యాలయాలు నత్తనడకన చేసిన ఆవిష్కరణలను కూడా మార్కెట్ చేయటానికి ఏళ్లు పడుతోందని, ప్రపంచ మార్కెట్‌లో మనం వెలవెలబోతున్నామని, దేశ ప్రజలకు శాస్త్ర ప్రయోజనాలు అందటం లేదని నిపుణులు అన్నారు.

"మన దగ్గర విజ్ఞానానికి కొదువ లేదు. ఉత్సాహమూ ఉంది. ప్రతిభ ఉంది .. వనరులూ ఉన్నాయి. వేగం కొరవడింది. వాటిని అందుకోవాలన్న పట్టుదల ఉండటం లేదు. ఈ రెండూ ఉంటే మనకు తిరుగులేదు." అని ఒకరంటే, "మనకు మంచి మార్కెట్ అవకాశాలున్నాయి. ప్రతిభ గల యువతరముంది. మనం వెనకబడితే.. ఇంకొకరు అందుకుంటారు" అని మరొక వక్త హెచ్చరించారు.

కేవలం నినాదాలకు పరిమితంకాకుండా.. సరైన విధానాలతో వ్యవస్థల్ని సరైన రీతిలో వేగంగా, పట్టుదలతో నిర్మించుకోవటమే ప్రపంచస్థాయికి ఎదగటానికి మన ముందున్న పరిష్కారమని ఆలస్యంగానైనా గుర్తిద్దాం.

# లోక్‌సత్తా అంశాల చుట్టూనే రాజకీయం : భీశెట్టి



**2014** అసెంబ్లీ ఎన్నికల్లో గతిలేక చంద్రబాబు నాయుడికి ఓటు వేసిన ప్రజలకు ఇప్పుడిప్పుడు వాస్తవాలు అర్థమవుతున్నాయని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా నుంచి పెద్ద నోట్ల వరకూ లోక్‌సత్తా విధానాలు, వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పదేపదే చెబుతున్న పరిష్కారాలే సరైనవని గుర్తిస్తున్నారని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. రాజకీయం ఉన్నకొద్దీ లోక్‌సత్తా అంశాల చుట్టూనే తిరుగుతోందని, సంస్థాగతంగా బలోపేతమయ్యేందుకు ఎక్కువ కష్టపడాలని అన్నారు. విజయనగరంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో బాబ్జీ మాట్లాడారు. రాష్ట్రంలో చంద్రబాబు, కేంద్రంలో మోదీ ఏకపక్షంగా వ్యవహరిస్తూ ప్రజలను చులకనచేస్తున్నారన్నారు. ప్రజాసమస్యలపై అధ్యయనంతో ఎప్పటికప్పుడు స్పందిస్తుండాలని, అధికారాన్ని జనం చేతికి తీసుకెళ్లేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లాకు ప్రభుత్వ వైద్యకళాశాలను సాధించేంతవరకూ విశ్రమించబోమని సీనియర్ నాయకుడు లక్కరాజు శివరామారావు అన్నారు. పార్టీ స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఆకుల దామోదర్ ఈ సందర్భంగా జిల్లా కమిటీ ప్రతినిధులను ప్రకటించారు. జిల్లా సమన్వయ కమిటీ: టి.కనకరాజు (పార్వతీపురం), ఎ. దామోదరరావు (బొబ్బిలి), జి. సత్యనారాయణ (చీపురుపల్లి), ఆర్.పద్మావతి (నెల్లిమర్ల), ఎ.నాగభూషణం (విజయనగరం), కె.ప్రసాద్ (ఎస్.కోట). జిల్లా మహిళాసత్తా: ఐ.అనంతలక్ష్మి, బి.రామలక్ష్మి, కె.శ్రీదేవి, పి.లక్ష్మి, రాయి పద్మావతి. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ సీనియర్ నాయకులు మూర్తి, మిడతాన అప్పారావు, పోలపర్తి అప్పలసత్యం, కాశీపతి, నేరెళ్ల తదితరులు పాల్గన్నారు. నేతలు, కార్యకర్తలు ఈ సందర్భంగా బాబ్జీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# ఫీ జులుం, అవినీతిపై చర్యలు తీసుకోండి






**2014-18** బ్యాచ్ కన్వీనర్ కోటా విద్యార్థులు చెల్లించాల్సిన వార్షిక ఫీజు రూ.68,900 కాగా, వరంగల్ ఎస్.ఆర్ ఇంజినీరింగ్ కళాశాల వంటి కొన్ని విద్యాసంస్థలు అదనంగా రూ.24,700 వసూలు చేస్తున్నాయని లోక్‌సత్తా పార్టీ అనుబంధ విద్యార్థిసత్తా తెలంగాణ విభాగం ఆరోపించింది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎందుకిలా వసూలు చేస్తున్నారని నిలదీస్తే.. 'ఇవేమీ తమ సొంతానికి చేస్తున్న అక్రమ వసూళ్లు కావని, సాంకేతిక తనిఖీ అధికారులు, ఇతర విద్యాశాఖ అధికారులకు పర్సంటేజీల లెక్కన ప్రతి ఏటా ముడుపులు చెల్లించనిదే తమ కాలేజీకి మనుగడ ఉండదు కాబట్టే ఇలా అదనంగా వసూలు చేస్తున్నాం' అని యాజమాన్యాలు చెబుతున్నాయన్నారు. మీకు దిక్కున్నచోట చెప్పుకోండని బెదిరిస్తున్నారన్నారు. విద్యార్థుల త్యాగాలతో వచ్చిన తెలంగాణలో విద్యను వ్యాపారంగా చేసి వారి జీవితాలతో చెలగాటమాడుతున్నా సంస్కరించలేని ప్రభుత్వం ఉండటం దురదృష్టకరమన్నారు. సర్కారు ఫీజు రీఇంబర్స్‌మెంట్‌ని సక్రమంగా చేయకపోవటం వల్ల విద్యార్థులు ఇలా కళాశాలల దోపిడీ బారిన పడుతున్నా రన్నారు. ఈ ఫీ జులుంని, అవినీతిని విద్యార్థి బృందంతో కలిసి విద్యార్థిసత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట పవన్ వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, ఈ ఫిర్యాదు తర్వాత ఎస్.ఆర్ కళాశాల యాజమాన్యం విద్యార్థిసత్తా నేతలపై బెదిరింపులకు పాల్పడుతుండటాన్ని లోక్‌సత్తా రాష్ట్ర నాయకత్వం ఖండించింది.

# విధివిధానాలు లేకుండానే ప్రైవేటు వర్సిటీలకు అనుమతా?

- జి. రాజారెడ్డి,
లోక్‌సత్తా ఎన్ఎఫ్‌సి ఛైర్‌పర్సన్



© BCCL 2013. ALL RIGHTS RESERVED.

డిమాండ్‌ను బట్టి ప్రైవేటు యూనివర్సిటీలకు అనుమతినివ్వాలి. విశ్వవిద్యాలయాల ఏర్పాటులో విధివిధానాలు ప్రకటించకుండానే తెలంగాణ ప్రభుత్వం అనుమతుల దిశగా చర్యలు ప్రారంభించింది. ఇది ప్రజాప్రయోజనాలకు మంచిది కాదు. నాణ్యత లేని విద్యాబోధన, సౌకర్యాలు లేని ప్రైవేటు కళాశాలలు ఎన్నో ఉన్నాయి. వాటి స్థానే యూనివర్సిటీల ఏర్పాటుకు అనుమతి సరైంది కాదు. వందకు పైగా ఎకరాల్లో యూనివర్సిటీ ఉండాలి. ఇప్పటికే ఉన్న ప్రైవేటు వర్సిటీల్లో అలాంటివి చాలా తక్కువగా కనిపిస్తాయి. రకరకాల ఆకర్షణీయమైన ప్రకటనలతో విద్యార్థులను మోసగిస్తున్న కళాశాలలు, యూనివర్సిటీలు ఎన్నో ఉన్నాయి. ప్రభుత్వం ముందుగా ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థలపై నిఘా వేయాలి. విద్యార్థులకు సరైన విద్యాబోధన జరుగుతోందా, లేదా? యాజమాన్యాలు నాణ్యత గల విద్య అందిస్తున్నారా, లేదా? అనే విషయాల్ని నిశితంగా పరిశీలించాలి. ప్రభుత్వ యూనివర్సిటీలలో సిబ్బంది కొరత, విద్యార్థుల సంఖ్య ఎంతుందో, అవసరాలు ఏమిటో గుర్తించాలి. ప్రభుత్వ కళాశాలలు, యూనివర్సిటీలను అప్‌డేట్ చేస్తే బాగుంటుంది. డిమాండ్‌ను బట్టి మాత్రమే ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు అనుమతినివ్వాలి. లేకుంటే విద్యార్థులు, ప్రభుత్వం నష్టపోయే ప్రమాదముంది. ప్రైవేటు వర్సిటీల్లో ఫీజులు అధికంగా ఉంటాయి. దీంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఒకరకంగా ఇది అవకాశాలున్నవారికే అవకాశాలందివ్వటంగా మారుతుంది. అరకొర సౌకర్యాలున్న ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో సామాన్యులు చదువుకోలేక, ప్రైవేటు యూనివర్సిటీలో అధిక ఫీజులు చెల్లించలేక ఉన్నత చదువును అర్ధాంతరంగా మానేసుకోవాల్సిన దుస్థితి నెలకొంటుంది. ఉదాహరణకు కేంద్రం చేసిన పెద్ద నోట్ల రద్దు నేపథ్యంలో రెండు కోట్లయినా దొరుకుతున్నాయి, లేనివారికి రెండు వేలు కూడా దొరకటం కష్టంగా ఉంది. ఇష్టమొచ్చినట్టు ప్రైవేటు యూనివర్సిటీలకు అనుమతులిస్తే ఇదేవిధంగా జరుగుతుంది. డబ్బు లేదని ఏ విద్యార్థి చదువూ ఆగకుండా ఆర్థికపరంగా భరోసా కల్పించే ఏర్పాటు చేయటంతోపాటు ప్రభుత్వ విశ్వవిద్యాలయాల ప్రమాణాలను సమూలంగా ప్రక్షాళన చేయాలి. యూనివర్సిటీలలో యువత రాణించటానికి మూలమైన పాఠశాల విద్యను సృజనాత్మకంగా పటిష్టం చేయాలి. ఇవన్నీ చేశాక అప్పుడు డిమాండ్‌ను బట్టి ప్రైవేటు యూనివర్సిటీల వారికి అవకాశం ఇవ్వొచ్చు. రిజర్వేషన్లు వంటి తూతూ మంత్రం ఏర్పాట్ల వల్ల పెద్దగా ఒరిగేదేమీ ఉండదు. ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఏర్పాటుపై విధివిధానాలపై పాలకులు స్పష్టత ఇవ్వాలి.

# మీడియా ప్రమాణాలతో ప్రజాస్వామ్య పరిణతి పెరుగుతుంది





భారతదేశం బాగుపడాలంటే ప్రజలు పౌరులుగా మారాలి.. ప్రజలు పౌరులుగా మారాలంటే ప్రధానంగా దేశంలో విద్యావ్యవస్థ, మీడియాలో మార్పులు రావాలి" అని ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రీసెర్చి (ఎఫ్‌డీఆర్) చర్చా సమావేశం అభిప్రాయపడింది.

భారతీయ మీడియాలో ఎజెండాను ఎలా నిర్ణయిస్తుంటారు, ఎజెండా ఎలా ఉండాల్సుంది అనే అంశాలను సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ (సీఎంఎస్) వ్యవస్థాపకుడు డా॥ ఎన్.భాస్కరరావు ఎఫ్‌డీఆర్ పరిశోధనా విద్యార్థులకు హైదరాబాద్ కార్యాలయంలో వివరించారు.

హేతుబద్ధ వాదనలు, ప్రజాస్వామిక ప్రాతినిధ్యంతో మీడియాలో బహిరంగ చర్చా ప్రమాణాలు పెరిగితే రాజకీయాలు, పాలనలో పారదర్శకత, ప్రజాస్వామిక సంస్కృతి పెరుగుతూ దేశంలోని మారుమూల, అటవీ ప్రాంతాలలోని ప్రజలకు కూడా హక్కులు అందుతాయని అన్నారు.

ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న భారతీయ మీడియా, ఊపందుకుంటున్న సోషల్ మీడియా చర్చా ప్రమాణాల మీద దృష్టి పెడితే అత్యుత్తమ ఫలితాలను సాధించగలవన్నారు.

ఆలోచనలు ఆచరణలోకి మారటానికి తగిన విధానాలపై కృషి చేస్తున్న ఎఫ్‌డీఆర్ విద్యార్థుల అభిప్రాయాలను భాస్కరరావు అభినందిస్తూ వారు అడిగిన పలు ప్రశ్నలకు జవాబిచ్చారు.



## నాయకత్వం, వ్యవస్థలుపై సూచనలిచ్చిన డా॥ తుమ్మల

పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో అమెరికాలోని కన్సాస్ స్టేట్ యూనివర్సిటీలో విశ్రాంత ఆచార్యునిగా సేవలందిస్తున్న డా॥ కృష్ణ తుమ్మల ఇటీవల హైదరాబాద్‌లోని ఎఫ్‌డీఆర్ కార్యాలయాన్ని సందర్శించి.. నాయకత్వం, వ్యవస్థలు, తగినన్ని వనరులు, నిబద్ధత, అవినీతిపై పోరాటానికి చట్టాలు అంశాలపై పరిశోధనా విద్యార్థులకు సూచనలిచ్చారు. తుమ్మలకు తొలుత ఎఫ్‌డీఆర్ ప్రధాన కార్యదర్శి డా॥ జయప్రకాష్ నారాయణ్ స్వాగతం పలికారు.



# స్థానిక స్వయంపాలనను సహించలేని పెత్తందారీ ముఖ్యమంత్రులు

స్థానిక ప్రభుత్వాలకు రాష్ట్ర ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలతో నిమిత్తం లేకుండా నేరుగా నిధుల్ని కేటాయించాలని, రాష్ట్ర ప్రభుత్వం కేవలం అక్కడ అవకతవకలు లేకుండా పర్యవేక్షించే పాత్రకే పరిమితంకావాలని చాలాకాలంగా డిమాండ్ చేస్తున్న లోక్‌సత్తా 14వ ఆర్థికసంఘాన్ని కూడా ఆమేరకు లిఖితపూర్వకంగా అభ్యర్థించింది. కేంద్రం నుంచి రాష్ట్రాలకు పన్నుల వాటా రూ.38లక్షల కోట్లకు చేరిందికాబట్టి, రాష్ట్రాలకు కనీసం రూ.8లక్షల కోట్లు నేరుగా బదిలీ చేయాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పలుమార్లు ఆర్థికసంఘానికి విజ్ఞప్తి చేశారు. అంత పెద్ద నిర్ణయం తాము తీసుకోలేమన్న ఆర్థికసంఘం సారథులు చివరికి రూ.2.75 లక్షల కోట్ల వరకూ స్థానిక ప్రభుత్వాలకు నిధులు అందే ఏర్పాటు చేశారు. ఇవి కూడా రాష్ట్రాల ద్వారానే బదిలీ అవుతాయి. అయితే, రాష్ట్రాలు ఈ నిధుల్ని ఇతరత్రా ఖర్చులకు మళ్లిస్తే మాత్రం.. కేంద్రం ఆ తర్వాత నిధులకు కొర్రీ వేస్తోంది. ఈ నేపథ్యంలోనే.. తమ కేంద్రీకృత పాలనను మరింత పటిష్టపరచుకోవటమే లక్ష్యంగా ఉన్న తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, కె. చంద్రశేఖరరావు 'స్థానిక ప్రభుత్వాలకు నేరుగా నిధులు' షరతుని తొలగించాలని కేంద్రాన్ని కోరుతున్నారు. ఆమధ్య అంతర్రాష్ట్ర మండలి సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి బహిరంగంగానే ఈ ప్రకటన చేశారు (నిధుల్ని పెంచాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలు.. తమ పరిధిలోని స్థానిక ప్రభుత్వాలకు మాత్రం నిధులు, అధికారాలను ఇవ్వటం లేదని 14వ ఆర్థిక సంఘానికి ఛైర్మన్‌గా వ్యవహరించిన ఆర్‌బీఐ మాజీ గవర్నర్ వై.వి రెడ్డి ఇటీవల తన ఆత్మకథ పుస్తకం విడుదల సందర్భంగా కూడా వ్యాఖ్యానించారు). అయితే కేంద్రం ససేమీరా అనటంతో కొత్త ఎత్తుగడలు వేస్తూ తమ సొంత పార్టీలవారికి లబ్ధి కలిగేలా ప్రయత్నాలు ప్రారంభించారు.




**గ్రామజ్యోతి వెలిగేదెన్నడు?**

తెలంగాణ పంచాయతీల విషయానికొస్తే.. అధికార తెరాస ఎక్కువగా ఫిరాయింపుల మీద ఆధారపడుతోంది. వార్డు

సభ్యులు, సర్పంచ్‌లను పెద్దఎత్తున తెరాసలోకి లాగేస్తున్నారు. గ్రామాలకు ఏటా రూ. 5,000 కోట్ల నిధుల్ని, అధికారాలను కేటాయిస్తామంటూ ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన 'గ్రామజ్యోతి'ని కనీసం వెలిగించలేదు.

తెలంగాణలో గ్రామస్థాయికి అధికారాన్ని వికేంద్రీకరణకు తెలంగాణ ప్రభుత్వం 2015లో 'గ్రామజ్యోతి' పథకాన్ని ప్రకటించినప్పుడు లోక్‌సత్తా కూడా స్వాగతించింది. అయితే ఏళ్లు గడుస్తున్నా ఈ పథకం ఆచరణ రూపం దాల్చలేదు. గ్రామాల్లో సమస్యలు యథావిధిగా కొనసాగుతున్నాయని, గ్రామజ్యోతి ఊసే కనిపించటం లేదని క్షేత్రస్థాయి పరిశీలనలు చేస్తున్న లోక్‌సత్తా నేతలు పలు సందర్భాల్లో చెప్పారు. ఇప్పుడు అవసరానికి మించిన సంఖ్యలో జిల్లాల్ని విభజించినా (తెలంగాణలో 18 జిల్లాలు ఉంటే చాలన్నది హేతుబద్ధ అంచనా) పెత్తనం వార్డు స్థాయిలో స్థానిక ప్రజల చేతుల్లోకి వెళ్లకుండా ముఖ్యమంత్రి, కలెక్టర్ల చుట్టూనే తిరుగుతూ వున్నాయి.

గ్రామజ్యోతి సక్రమంగా అమలు జరిగితే కొన్ని మౌలిక అవసరాల్లో తెలంగాణ గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)లను రూపొందించడం ఇందులో కీలకమైనది. కేంద్రం సూచనలకు తెలంగాణ సర్కారు మరిన్ని అంశాలను జోడించి గ్రామజ్యోతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పంచాయతీ పరిధిలోని ఆరోగ్యం-పోషకాహారం, విద్య, సామాజికాంశాలు, పేదరికం, వ్యవసాయం, ప్రకృతి వనరుల యాజమాన్యం, మౌలిక వసతులు.. అనే ఏడు రకాల కార్యక్రమాలను ఇందులో అతి ముఖ్యమైనవిగా పొందుపరిచింది. పలు శాఖలు గ్రామాల్లో వివిధ రకాల పథకాలను అమలుచేస్తున్నా వాటి మధ్య సమన్వయం ఉండక సరైన ఫలితాలు లభించేవి కావు. ఇటువంటి శాఖలన్నింటినీ సమన్వయపరచడం, పంచాయతీకి వచ్చే వివిధ రకాల నిధులను సద్వినియోగం అయ్యేలా చూడడం జీపీడీపీ లక్ష్యం. సప్త అంశాల అమలుకు పంచాయతీ స్థాయిలో ఒక్కో కార్యాచరణ బృందం ఏర్పాటు కావాలి. అక్కడి సర్పంచి, వార్డు సభ్యులు, డ్వాక్రా, సేవా సంస్థల ప్రతినిధులు తదితరులు ఈ బృందాల్లో సభ్యులుగా ఉంటారు. కనీసం రెండు నెలలకు ఒకసారైనా కలెక్టరు, జిల్లా పరిషత్ సీఈవోలు గ్రామజ్యోతి కార్యక్రమాన్ని సమీక్షిస్తూ లోపాలు ఉంటే సరిచేస్తుండాలి.

కానీ, ఇప్పటికీ గ్రామజ్యోతి అమలుకాకపోవటం వల్ల గ్రామాలను దత్తత తీసుకున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

## గ్రామజ్యోతితో స్థానిక సాధికారతకు ఈ మూడు కీలక చర్యలు తీసుకోవాలి : జేపీ



(గ్రామజ్యోతి పథకాన్ని ప్రారంభించినప్పుడు స్వాగతిస్తూ 2015, ఆగస్టు 12న జేపీ విడుదల చేసిన మీడియా ప్రకటన నుంచి)

"1. పంచాయతీ క్లస్టర్ల వ్యవస్థ ఏర్పాటు: ప్రతి పంచాయతీలో ఒక ఆఫీసు, కంప్యూటరు, సిబ్బంది, హైస్కూలు తదితర మౌలిక వసతులు ఉండాలి. అయితే పంచాయతీలు చిన్నవైతే, ఒక్కో ఉద్యోగి మీద ఏటా లక్షలు వెచ్చించాల్సిన నేపథ్యంలో నిర్వహణ భారమై ఫలితాలు పెద్దగా రావు. అందుకే చిన్న పంచాయతీల సమూహాన్ని కలిపి వాటిని పంచాయతీల క్లస్టర్లుగా ఏర్పాటు చేసి ఒక యూనిట్‌గా పరిగణించాలి. అప్పుడు ఒక ఆఫీసు, కంప్యూటరు, మౌలిక సదుపాయాలు, సిబ్బంది, మంచి హైస్కూలు వగైరా ఏర్పాట్లు సాధ్యమవుతాయి. అప్పుడు గ్రామజ్యోతి గణనీయ ఫలితాలను అందిస్తుంది.

2. మునిసిపాలిటీలలోనూ వార్డు స్థాయిలో ఏటా తలసరి రూ. 1000-1500 కేటాయించటం: పట్టణ ప్రాంతాల స్థానిక పాలనలోనూ అధికార వికేంద్రీకరణకు చర్యలు చేపట్టాలి. ఇందుకోసం మునిసిపల్ వార్డు స్థాయిలోకి ఏటా తలసరి రూ. 1000-1500 కేటాయించి ప్రజలు ఎన్నుకున్న వార్డు ప్రభుత్వాలతో ఆ డబ్బును ఖర్చు చేయాలి. వార్డు ప్రభుత్వాల ఏర్పాటుకి రాజ్యాంగంలో స్పష్టమైన ఏర్పాటు ఉంది. ప్రజా కమిటీలే వార్డుల్లో పనులు చేసుకునేందుకు నిధులుంటే పారిశుద్ధ్యం, రోడ్లు, మురుగుపారుదల, వీధి దీపాలు వంటి పనుల్ని వెంటనే పూర్తి చేసుకోగలుగుతారు.

3. జిల్లాస్థాయిలో అంబుడ్స్‌మన్ ఏర్పాటు: స్థానిక స్థాయిలో జనాభా ప్రాతిపదికన కేటాయించిన నిధుల వినియోగాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ అక్కడ అక్రమాలు, అవినీతి జరిగితే కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రతి జిల్లాలో స్వతంత్ర అంబుడ్స్‌మన్‌ను ఏర్పాటు చేయాలి."

కూడా ఆయా ఊళ్లలో పాలనా మార్పుల్ని అమలుచేయటం లేదు. ప్రజాప్రతినిధులు నిస్సిగ్గుగా పార్టీలు ఫిరాయించటం, ప్రభుత్వాధికారులు చేయాల్సిన పనుల్ని తాము చేసిపెడతామంటూ ఓట్లు దండుకోవటం, ప్రభుత్వాధికారుల సహాయంతో అవినీతిని, వనరుల దోపిడీని యథేచ్ఛగా కొనసాగించటం, స్థానిక లంచాల్ని, వేధింపుల్ని, సమస్యల్ని

## కేంద్రం మాతృభూమి కమిటీలంటూ రాష్ట్రంలో పెత్తనం చేస్తే ఊరుకుంటారా ? : జేపీ



ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా జన్మభూమి కమిటీలతో పనుల్ని సాగిస్తోందని, ఆ కమిటీల్ని రద్దు చేయాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ డిమాండ్ చేశారు. గ్రామస్థాయిలో ఎన్నికైన ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండా ఈ కమిటీలతో పనులు చేపట్టటం దారుణమన్నారు. అధికార వికేంద్రీకరణతో ఫెడరలిజాన్ని బలోపేతం చేయటానికి కృషి చేసిన తెలుగుదేశం, ఆ పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీరామారావు స్ఫూర్తికి విరుద్ధంగా ఈవేళ ఆ పార్టీ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం మాతృభూమి కమిటీలంటూ ఏర్పాటు చేసి రాష్ట్రంలో పాలనను చేజిక్కించుకుంటే చంద్రబాబు ప్రభుత్వం ఊరుకుంటుందా? అని ప్రశ్నించారు.

విశాఖపట్నంలోని వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో యువతతో జేపీ సమావేశమయ్యారు. అనంతరం లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, స్టీరింగ్ కమిటీ, జిల్లా నేతలు వేణుగోపాల్, సాంబశివరావు, హరిగణేష్, పంచాది రాంబాబు, లోక్‌సత్తా ఉద్యమ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహనరావు తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలాగే స్థానిక ప్రభుత్వాలకు కూడా స్వతంత్ర ప్రతిపత్తి కలిగినవని, మూడో అంచె ఫెడరలిజం బలపడితేనే భారతదేశ సుస్థిరాభివృద్ధి సాధ్యమని జేపీ స్పష్టం చేశారు. అధికార వికేంద్రీకరణను ఇంకా పెంచాల్సిందిపోయి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా కేంద్రీకృతం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దాదాపు ఐదేళ్లపాటు గ్రేటర్ విశాఖ మునిసిపల్ ఎన్నికలను నిర్వహించకుండా వ్యవహరించిన తీరు.. కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలకు స్థానిక ప్రభుత్వాల పట్ల ఎంత చిన్నచూపు ఉందో తేటతెల్లం చేస్తోందన్నారు. జాతీయ రహదారిపై 500 మీటర్లలోపు మద్యం దుకాణాలు, బార్లు ఏర్పాటు చేయకూడదన్న సుప్రీంకోర్టు ఆదేశాన్ని నిక్కచ్చిగా అమలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలలో మనదేశం ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉందని, యాక్సిడెంట్లకు బలవుతున్నవారిలో ఎక్కువగా యువతేనని అన్నారు. బహిరంగ మద్యపానాన్ని కట్టడి చేయటం వల్ల యాక్సిడెంట్లను, శాంతిభద్రతలను, మహిళలపై వేధింపుల్ని గణనీయంగా తగ్గించవచ్చన్నారు. ఈ అధికారాల్ని, కల్తీ మద్యం కట్టడి బాధ్యతను స్థానిక ప్రభుత్వాలకే అప్పచెప్పాలన్నారు. స్థానిక ప్రభుత్వాలకు పూర్తిస్థాయిలో నిధుల్ని అందించి నిర్ణయాలను స్థానిక ప్రజాప్రతినిధులకు, ప్రజలకే వదిలేయాలని, అక్కడ అవినీతి జరగకుండా రిటైర్డ్ జడ్జీతోనో, సీనియర్ అధికారితోనో అంబుడ్స్‌మన్ వ్యవస్థను ప్రతి జిల్లాలో ఏర్పాటు చేయాలని జేపీ అన్నారు.

అన్ని అధికారాలూ గుప్పెట్లో పెట్టుకున్న ముఖ్యమంత్రి పరిష్కరించలేకపోవటంతో ప్రజలు నిస్సహాయంగా పాలకులు ఇచ్చే తాయిలాల కోసం ఎదురుచూడటం ఆనవాయితీగా మారిపోయింది. పొద్దున లేచిన దగ్గర్నుంచి ప్రజల జపం చేస్తూ, ఆచరణలో మాత్రం ప్రజావ్యతిరేక పెత్తనం కొనసాగిస్తున్నారు.

**పంచాయతీల నిధులను ఫలహారం చేస్తున్న జన్మభూమి కమిటీలు**

ఆంధ్రప్రదేశ్‌లో అయితే, స్థానిక ప్రభుత్వాలను అణగదొక్కటం, దోచేయటం కొత్త పుంతలు తొక్కుతోంది. సర్పంచ్‌లను ఆకర్షించటంతోపాటు అదనంగా జన్మభూమి కమిటీలని ఏర్పాటు చేసి ప్రజాస్వామ్యాన్ని పార్టీస్వామ్యంగా మార్చివేస్తున్నారు. ఫెడరలిజాన్ని అపహాస్యంచేస్తూ స్థానిక ప్రభుత్వాలను నిర్వీర్యం చేసి తమ పార్టీవారికి నిధుల్ని దోచిపెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష ప్రభుత్వం ఎలాగైతే ఎన్నికలలో సుదీర్ఘకాలం గెలవటానికి వీలుగా ప్రభుత్వ కార్యక్రమాలను పార్టీవారికి అప్పచెప్పిందో, అదేరీతిలో చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు ఏపీలో వ్యవహరిస్తోంది.

పంచాయతీలు, మునిసిపాలిటీలకు పూర్తి అధికారాలను,




నిధులను బదిలీ చేస్తానని 2003లో లోక్‌సత్తా ఉద్యమం కోటి సంతకాల ఉద్యమం చేపట్టినప్పుడు హామీ ఇచ్చిన చంద్రబాబు.. ఇప్పటిదాకా ఆ మాట నెరవేర్చకపోగా, ఇప్పుడు అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. పంచాయతీలలో సర్పంచ్‌లకున్న అధికారాలను ఒకటొకటిగా కత్తిరిస్తూ జన్మభూమి కమిటీలకు అప్ప చెబుతున్నారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలపై, కేటాయింపుల ప్రతిపాదనలపై చర్చించాల్సిన గ్రామసభల నిర్వహణను సర్పంచ్/ఉపసర్పంచ్‌ల నుంచి తప్పించి జన్మభూమి కమిటీలకు అప్పచెప్పాలని ముఖ్యమంత్రే స్వయంగా కలెక్టర్లను ఆదేశించారు (గ్రామసభ కార్యక్రమంలో భాగంగా ఊరిలోని ఓటర్లు ప్రతి సంవత్సరం విధిగా నాలుగు సార్లు సమావేశం కావాలి. ఏప్రిల్, జులై, అక్టోబర్, జనవరిలో ఈ గ్రామసభల్ని సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించాలి).

ఇప్పటికే పల్లెల్లో పింఛన్లు, ఇళ్ల మంజూరు వంటి సంక్షేమ కార్యక్రమాల్లో లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా జన్మభూమి కమిటీల చేతుల్లోకి వెళ్లిపోయింది. రాజకీయ కారణాల వల్ల పలువురు అర్హులకు పింఛన్లు నిలిపివేసినట్లు అసంఖ్యాకంగా ఫిర్యాదులు వచ్చాయి. వందలాదిమంది హైకోర్టును ఆశ్రయించి పింఛన్లు పొందారు.

అలాగే, 2016 మార్చిలో నీరు-చెట్టు కార్యక్రమం కింద రూ.10లక్షల విలువైన పనులను నామినేషన్‌పై జన్మభూమి కమిటీలు, సాగునీటి సంఘాలకు ప్రభుత్వం అప్పగిస్తూ జీవో జారీ చేసింది. ఈ కమిటీల్లో అధికార పార్టీ సభ్యులే ఎక్కువగా ఉంటారు. ప్రతిపక్షం నుంచి వలసవచ్చినవారికి కాస్త ఎక్కువ ప్రాధాన్యత కల్పిస్తున్నారు. సాగునీటి సంఘాలకు ఎన్నికలే లేకుండా ఏకగ్రీవం పేరుతో అధికార పార్టీ నేతలతో నింపేశారు.

రాష్ట్ర విభజనకు ముందు.. గరిష్ఠంగా రూ.లక్ష విలువైన పనులను మాత్రమే నామినేషన్ మీద అప్పగించాలనే నిబంధన ఉండేది. చంద్రబాబు ప్రభుత్వం ఈ పరిమితిని రూ.5లక్షలకు పెంచింది. ఆ తర్వాత రూ.10లక్షలకు తీసుకెళ్తూ జీవో జారీ చేసింది. తాజాగా గ్రామసభలపై జన్మభూమి కమిటీలకు పెత్తనం ఇవ్వటం 1994 పంచాయతీరాజ్ చట్టానికి, ఫెడరల్ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధం. భూముల కేటాయింపుల్ని గుప్పెట్లో పెట్టుకోవటంతోపాటు కార్యకర్తలను ప్రజాధనంతో మెయింటెయిన్ చేస్తూ ఎన్నికల సమయంలో వాడుకోవటానికి వీలుగా ప్రభుత్వం ఇంత రాజ్యాంగవిరుద్ధంగా, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోంది. పంచాయతీలకు నేరుగా వచ్చే నిధులతోపాటు మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం నిధులకు సంబంధించి జన్మభూమి కమిటీలు చేసే నిర్ణయాలనే ఇక సర్పంచ్‌లు, గ్రామస్తులు కూడా పాటించాల్సుంటుంది. కోర్టు జోక్యం చేసుకుంటే ప్రభుత్వం మాటమారుస్తుంది కాబట్టి.. పాలనలో పార్టీస్వామ్యాన్ని నిర్మూలించాలంటే జన్మభూమి, ఇతర నామినేటెడ్ కమిటీలు, కేంద్రీకృత పాలన స్థానంలో ప్రజలకు తలసరి ఏటా రూ.1000-2000 కేటాయించి, ప్రజలు ఎన్నుకున్న వార్డు కమిటీల వ్యవస్థను ఏర్పాటు చేయటమొక్కటే పరిష్కారం.

తమిళనాడులో జయలలిత విపరీత కేంద్రీకృత, ఏకస్వామ్య పాలన వల్ల ఇప్పుడు ఎదురవుతున్న సంక్షోభాన్ని చూశాకైనా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు జాగ్రత్తపడాలి.

తెలుగు రాష్ట్రాలలో స్థానిక ప్రభుత్వాలకు, ఎన్నికైన వార్డు కమిటీలకు నిధులు, అధికారాల బదిలీ, తలసరి కేటాయింపు, అక్కడ అవినీతి, అక్రమాలు జరిగితే చర్యలకు జిల్లా స్థాయి అంబుడ్స్‌మన్ వ్యవస్థ ఏర్పాటుకు సర్పంచ్‌లు, మునిసిపల్ ప్రజాప్రతినిధులు, ప్రజల సాధికారత కోసం ఆరాటపడే ఆలోచనాపరులు, సంస్థలు కలిసి పోరాడాల్సిందే.

# ఈ తీర్పు 'మార్పు'గా మారాలంటే సంస్కరణలు కావాలి: జేపీ



కులం, మతం, జాతి, వర్గం, భాష ప్రాతిపదికగా ఓట్లేయాలంటూ అడిగే ఏ విజ్ఞప్తి అయినా ఎన్నికల నిబంధనావళి ప్రకారం అవినీతి కిందికే వస్తుందన్న సుప్రీంకోర్టు తీర్పును రాజ్యాంగం అమలు క్రమంలో సానుకూల పరిణామంగా భావించవచ్చని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఎన్నికలలో ఇలాంటి వ్యవహారశైలిపై చర్యలు తీసుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘానికి కల్పించటం వల్ల కొంత ఫలితం కనిపించవచ్చన్నారు. ఈ తీర్పుని అద్భుతమంటున్న పార్టీలు తమ రాజకీయం మార్చుకుంటే ఈ దేశ రాజకీయాలు మారిపోతాయని, అయితే ఆచరణలో అధికారమే పరమావధిగా తయారైన రాజకీయం తీరు ఈ తీర్పుతో పెద్దగా మారకపోవచ్చన్నారు. ఒక్క ఓటుతోనైనా గెలిచినవారు తప్ప మిగిలినవారంతా ఓడిపోయినట్టే అనే మన ఎఫ్‌పీటీపీ ఎన్నికల పద్ధతి వల్ల.. ప్రతి ఓటు కోసం వెంపర్లాడటం, మనదేశ పరిస్థితుల్లో కాసిని అదనపు ఓట్ల కోసం డబ్బు, మద్యం, తాయిలాలు వంటి వాటితోపాటు కులం, మతం, ప్రాంతం వంటివి రెచ్చగొట్టటం జరుగుతున్నాయని అన్నారు. దీన్ని మార్చటానికి సదుద్దేశాలతోపాటు విధానపరమైన మార్పులకు సంస్కరణలు కావాలన్నారు. అదనపు ఓట్ల కోసం వెంపర్లాడాల్సిన అవసరం లేని ఎన్నికల సంస్కరణలు, పాలనలో అందరికీ భాగస్వామ్యాన్నిచ్చే అధికార వికేంద్రీకరణ వంటి మార్పుల్ని చేయకుండా కులమతాల రాజకీయాన్ని వేగంగా మార్చటం సాధ్యం కాదన్నారు. కులాన్ని నిర్మూలించాల్సిన రాజకీయం దాన్ని పెంచిపోషిస్తున్నా.. కులానికి మూలం రాజకీయం కాదని, అందువల్ల ఎన్నికల సంస్కరణలతోపాటు కులరహిత సమాజం కోసం సామాజిక సంస్కరణోద్యమాలు కూడా కొనసాగాలన్నారు.

వ్యక్తికి, దేవుడికి మధ్య సంబంధం వ్యక్తిగత ఇష్టాయిష్టాలతో కూడుకున్నదే కానీ ప్రభుత్వం లేదా పాలకులతో దీనికి సంబంధం లేదని సుప్రీంకోర్టు తన తీర్పులో వ్యాఖ్యానించింది. ఎన్నిక అనేది లౌకికపరమైన ప్రక్రియ అని, ఎన్నికైన ప్రజాప్రతినిధుల పనితీరు కూడా లౌకికంగానే ఉండాలని పేర్కొంది. ఎన్నికల ప్రక్రియలో మతానికి తావులేదని తేల్చిచెప్పేసింది. రాజ్యాంగ నీతిసూత్రాలు, బాధ్యతల్ని నెరవేర్చడంలో ప్రభుత్వం క్రియాశీలంగా ఉండాలని సూచించింది. ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం 4:3 మెజారిటీతో ఈ తీర్పు ఇచ్చింది.

అవినీతి వ్యవహారాలను నియంత్రించే ప్రజాప్రాతినిధ్య చట్టం (ఆర్‌పీ)లోని 123(3) నిబంధనలో ఉన్న 'అతని మతం' అనే మాటకు విస్తృత భాష్యం చెబుతూ.. దీనర్థం ఓటర్లు, అభ్యర్థులు, వారి ఏజెంట్లు సహా అందరి మతం, కులం కూడా అని మెజారిటీ న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. ఇలాంటి అంశాల్ని పరిష్కరించేటప్పుడు లౌకికవాదాన్ని పరిగణలోకి తీసుకోవాల్సుందన్నారు.

అయితే అతని 'మతం' అంటే అభ్యర్థి మతం మాత్రమేనంటూ మిగతా ముగ్గురు న్యాయమూర్తులు విభేదించారు. ప్రజల న్యాయబద్ధమైన ఆందోళనల గురించి మాట్లాడకుండా వ్యక్తుల్ని అడ్డుకోవటం ప్రజాస్వామ్యానికి విఘాతమని వ్యాఖ్యానించారు.

ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 123(3)లో వాడిన 'అతని' అనే మాటకు అర్థం అభ్యర్థి మత విశ్వాసం మాత్రమేనని 1995లో తీర్పు చెప్పిన కోర్టు – ఇప్పుడు అందుకు భిన్నంగా స్పందించింది. అభిరామ్‌సింగ్ సహా మరికొందరు వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్‌పై బెంచ్ విచారణ చేసింది. ముంబయిలోని శాంతాక్రజ్ అసెంబ్లీ సీటు నుంచి 1990లో బీజేపీ టికెట్టు మీద అభిరామ్‌సింగ్ గెలుపొందటాన్ని బోంబే హైకోర్టు కొట్టివేయటంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

### ఫిబ్రవరి 4 నుంచి పంచసమరం

ఉత్తర ప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్ అసెంబ్లీకు ఫిబ్రవరి 4 నుంచి మార్చి 8 వరకు ఎన్నికలు జరగనున్నాయి. ఉత్తరాఖండ్, గోవా, పంజాబ్‌లలో ఒకే దశలో ఎన్నికలు జరుగుతాయి. మణిపూర్‌లో రెండు దశల్లో జరుగుతాయి. యూపీ పోలింగ్ ఏడు విడతల్లో జరుగుతుంది. మార్చి 11న ఓట్ల లెక్కింపు ఉంటుందని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఐదు రాష్ట్రాల్లో 690 నియోజకవర్గాలలో 16 కోట్ల మంది (మొత్తం దేశ ఓటర్లలో ఐదోవంతు) ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.



ఐఐఎం అహ్మదాబాద్, ఐఐటీ బోంబే, ముస్సోరీలోని ఐఏఎస్‌ల శిక్షణా కేంద్రంలో.. నల్లడబ్బురహితంగా ఎన్నికలు, పాలనలో ప్రజల భాగస్వామ్యం పెంచటం తదితర ప్రజాస్వామ్య సంస్కరణలపై ప్రసంగాలు, చర్చా కార్యక్రమాల్లో పాల్గొన్న ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) ప్రధాన కార్యదర్శి, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్

Posting Date 22-01-2017
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on January 16th 2017

పెట్రోల్ బంకుల్లో జరిగే అవకతవకలు , అక్రమాల వల్ల సాధారణ ప్రజలకు ఎంతో నష్టం కలుగుతుంది . దీనిపై లోక్ సత్తా 1998 లోనే పోరాటం జరిపింది .



లోక్ సత్తా పోరాట ఫలితంగా బంకుల్లో మీటర్లు పెట్టారు . ఆ రకంగా గడచిన 15ఏళ్ళలో ప్రజలకు దాదాపు 2 లక్షల కోట్ల లబ్ది చేకూరింది.
ఇది ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ కంటే ఎక్కువ!

# నిజాలు మాట్లాడుకుందాం-12

షేర్ చేయండి ....ప్రజలకు నిజాలు చేరవేయండి

Book-Post
PRINTED MATTER

To

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad